మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 28-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 210 Issue: 210

Published from Jagitial
www.evarthalu.com

28 జనవరి 2026 - బుధవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:52 సూర్యాస్తమయం - సా. 6:05 తిథి దశమి సా. 4:34 వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం కృతిక ఉ. 9:25 వరకు తరువాత రోహిణి యోగం బ్రహ్మ రా. 11:45 వరకు కరణం గరజి సా. 4:34 వరకు వనిజ తె. 3:16ం వరకు వర్జ్యం రా. 12:09 నుండి రా. 1:37 వరకు దుర్ముహూర్తం మ. 12:06 నుండి మ. 12:51 వరకు రాహుకాలం మ. 12:29 నుండి మ. 1:53 వరకు యమగండం ఉ. 8:16 నుండి ఉ. 9:40 వరకు గుళికాకాలం ఉ. 11:05 నుండి మ. 12:29 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:16 నుండి ఉ. 6:04 వరకు అమృత ఘడియలు ఉ. 7:12 నుండి ఉ. 8:42 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

# ఈయూతో డీల్!

## భారత్–ఈయూ మదర్ ఆఫ్ ఆల్ డీల్స్ ఖరారు

### ఢిల్లీలో చారిత్రక ఘట్టం.. 18 ఏళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత తుది రూపం

**భారత్ నుంచి 97 శాతం ఎగుమతులపై సుంకాల రద్దు.. వచ్చే ఏడాది నుంచి ఒప్పందం అమల్లోకి వచ్చే అవకాశం**



భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్?టీఏ) ఖరారైంది. 18 ఏళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత కుదిరిన ఈ ఒప్పందాన్ని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించారు.

న్యూఢిల్లీ: మంగళవారం న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్?లో ప్రధాని నరేంద్ర మోదీ, ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా, కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టాలతో జరిగిన 16వ శిఖరాగ్ర సమావేశంలో ఈ ఒప్పందాన్ని అధికారికంగా ఖరారు చేశారు. ఈ ఒప్పందం ద్వారా భారత్ నుంచి జరిగే 97 శాతం ఎగుమతులపై సుంకాలు రద్దు కానున్నాయి. ముఖ్యంగా టెక్స్?టైల్స్, రత్నాలు, లెదర్ వంటి రంగాలకు ఇది భారీ ఊతాన్ని ఇవ్వనుంది. అదే సమయంలో యూర?ప్? కార్లు, యంత్ర పరికరాలకు భారత మార్కెట్?లోకి ప్రవేశం సులభతరం అవుతుంది. "ఈరోజు యూర?ప్?, భారత్ చరిత్ర సృష్టిస్తున్నాయి. మేం 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'ను ముగించాం. ఇరుపక్షాలకు ప్రయోజనం చేకూర్చేలా 200 కోట్ల మంది ప్రజలతో స్వేచ్ఛా వాణిజ్య క్షేత్రాన్ని సృష్టించాం" అని ఉర్సులా 'ఎక్స్' వేదికగా తెలిపారు. ఈ ఒప్పందం రెండు ప్రపంచ దిగ్గజాల మధ్య భాగస్వామ్యానికి చక్కటి ఉదాహరణ అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వాణిజ్యంతో పాటు రక్షణ, భద్రత, వాతావరణ మార్పులు, కీలక సాంకేతికతలు వంటి అంశాలపై కూడా ఇరుపక్షాలు దృష్టి సారించాయి. అమెరికా, చైనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, ఇతర ప్రాంతాలతో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని చూస్తున్న ఐరోపాకు ఈ ఒప్పందం వ్యూహాత్మకంగా చాలా కీలకం. ఈ ఒప్పందం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది అన్ని ఒప్పందాలకూ తల్లి లాంటిదని (మదర్ ఆఫ్ ఆల్ డీల్స్) తరువాయి 2 వ పేజీలో...




# 11న పుర పోలింగ్

## 13న కౌంటింగ్ నిర్వహణ.. ఈ నెల 30 వరకు నామినేషన్లు

### మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ రిలీజ్.. అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్

**నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ,, 16న మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని 116 మున్సిపాలిటీలు ,7 కార్పొరేషన్లకు ఎన్నికల షెడ్యూల్ ను ప్రకటించారు. ఈ ప్రకటనతో, ఎన్నికలు జరిగే పట్టణాల్లో ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి వచ్చింది. రాష్ట్రంలోని 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.

హైదరాబాద్, జనవరి 27 (ఈవార్తలు): నామినేషన్ల స్వీకరణ జనవరి 28న ప్రారంభమవుతుంది. జనవరి 30 వరకు కొనసాగుతుంది. జనవరి 31న నామినేషన్ల స్క్రూట్నీ ఉంటుంది. ఫిబ్రవరి 3న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఫిబ్రవరి 11న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఇక బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించబడుతుంది. అవసరమైతే ఫిబ్రవరి 12న రీపోలింగ్, ఫలితాలు ఫిబ్రవరి 13న వెల్లడిస్తారు. ఫిబ్రవరి 16న 116 మున్సిపాలిటీల్లో చైర్ పర్సన్ ,వైస్ చైర్ పర్సన్ ఎన్నికలు జరగనున్నాయి. అలాగే 7 కార్పొరేషన్లలో మేయర్ ,డిప్యూటీ మేయర్ ఎన్నికలు జరగనున్నాయి అని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రాణి కుముదిని పేర్కొన్నారు. ఇకపోతే ఈ ఎన్నికల్లో మొత్తం 52,43,000 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2996 వార్డులకు ఎన్నికలు జరుగుతాయని తరువాయి 2 వ పేజీలో...

మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర ప్రారంభం సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాం క్షలు తెలిపారు. ఆదివాసీ గిరిజన సమాజాల సబ్బండ కులాల సంస్కృతి, సంప్రదాయాలకు పదేండ్ల బీఆర్ఎస్ పాలన పెద్దపీట వేసిందని తెలిపారు.

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,195 |
| వెండి (గ్రాము): | రూ.387 |
| ప్లాటినం (గ్రాము): | రూ.7,888 |

## విశ్వవాణి



ఐస్‌లాండ్‌లోని పలు హోటళ్లలోని రిమోట్లలో ఒక ప్రత్యేకమైన బటన్ ఉంటుంది. ఆ బటన్ నొక్కితే ఆకాశంలో అద్భుతంగా కనిపించే నార్తర్న్ లైట్స్ వచ్చినప్పుడు హోటల్ సిబ్బంది.. వారిని నిద్రలేపి, బయటికి వచ్చి చూడాలని చెప్తుంటారు. దాంతో ప్రకృతి వింతను ఆస్వాదించే అవకాశం పర్యాటకులకు కలుగుతుంది.

# అసలు రాక్షసుడు సంతోషే!



## కేసీఆర్ ఏం తింటున్నాడో రేవంత్ రెడ్డికి చెప్పేది అతడే

### రేవంత్కు సంతోష్ రావు ప్రధాన ఇన్ఫార్మర్ : కల్వకుంట్ల కవిత

**గద్దర్, ఈటల వంటి వారిని కేసీఆర్?కు దూరం చేశారని ఆరోపణ**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన సమీప బంధువు, బీఆర్ఎస్ మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ రావుపై సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంతోష్ రావు ఒక 'ప్రధాన ఇన్ఫార్మర్' అని, 'రహస్య గూఢచారి'గా పనిచేస్తున్నారని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. సంతోష్ రావును కాపాడే ప్రయత్నం చేస్తుండవచ్చని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. మంగళవారం నాడు హైదరాబాద్?లోని నిమ్స్ ఆసుపత్రిలో ఆమె విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సంబంధించిన ప్రతి చిన్న విషయాన్ని సంతోష్ రావు.. రేవంత్ రెడ్డికి చేరవేస్తున్నారని కవిత ఆరోపించారు.

హైదరాబాద్, జనవరి 27 (ఈవార్తలు): "కేసీఆర్ ఏం తింటున్నారు... ఇడ్లీ తిన్నారా లేదా అనే విషయాన్ని కూడా రేవంత్ రెడ్డికి చేరవేసే వ్యక్తి సంతోష్" అని ఆమె ఘాటుగా విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులను, అమరవీరుల కుటుంబాలను కేసీఆర్?కు దూరం చేయడంలో సంతోష్ రావు కీలకపాత్ర పోషించారని ఆమె అన్నారు. విప్లవ గాయకుడు గద్దర్?ను ప్రగతి భవన్ బయట నిరీక్షించేలా చేసిన ఘటనకు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ బీఆర్ఎస్?ను వీడటానికి కూడా సంతోష్ రావే కారణమని ఆమె ఆరోపించారు. గతంలో తాను చెప్పిన రాక్షసుల్లో మొదటి వ్యక్తి సంతోష్ రావేనని కవిత స్పష్టం చేశారు. కేసీఆర్ ఒక దేవుడని, ఆయన చుట్టూ రాక్షసులు ఉన్నారని గత ఏడాది ఆమె వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో బీఆర్ఎస్ నుంచి సస్పెండైన కవిత, ఇటీవల ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తాను స్థాపించిన తెలంగాణ జాగృతిని రాజకీయ పార్టీగా మారుస్తున్నట్లు తరువాయి 2 వ పేజీలో...



# ఐదు గంటల పాటు సంతోష్ విచారణ

## ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎంపీని ప్రశ్నించిన సిట్

### ఇంటెలిజెన్స్ చీఫ్?గా ప్రభాకర్ రావు నియామకంపై ఆరా?

హైదరాబాద్, జనవరి 27 (ఈవార్తలు): బీఆర్ఎస్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ రావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సుదీర్ఘంగా విచారించింది. సిట్ విచారణ కొద్దిసేపటి కిందట ముగిసింది. సాయంత్రం మూడు గంటలకు ప్రారంభమైన విచారణ ఐదు గంటల పాటు కొనసాగింది. సిట్ అధికారులు సంతోష్ రావు వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఇంటెలిజెన్స్ చీఫ్?గా ప్రభాకర్ రావు నియామకం నిర్ణయం తరువాయి 2 వ పేజీలో...



# మేడారానికి బయల్దేరిన పగిడిద్ద రాజు

### సంప్రదాయ రీతిలో రహస్య పూజల నిర్వహణ

**నేడు సాయంత్రానికి వేదికపైకి!**

మేడారం, జనవరి 27 (ఈవార్తలు ప్రత్యేక ప్రతినిధి): మేడారం మహా జాతరలో కీలక ఘట్టం మొదలయింది. సమ్మక్క భర్త పగిడిద్దరాజును మేడారానికి తీసుకువచ్చే కార్యక్రమం మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం -2 వ పేజీలో...



# సీబీఐ.. సిట్టింగ్ జడ్జి?

**విచారణ బాధ్యత ఎవరికి ఇస్తారో ఇవ్వండి.. బొగ్గు కుంభకోణంపై గవర్నర్ కు బీఆర్ఎస్ ఫిర్యాదు**

**తెలంగాణలో సీఎం అంటే కోల్ మాఫియా.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

## రాశి ఫలాలు

28.1.2026

మేషం: మిత్రుల నుండి కొంత ఆసక్తి సమాచారం అందుతుంది. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ సభ్యులతో వివాదాలకు దూరంగా ఉ ఒడటం మంచిది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వ్యాపార ఉద్యోగాలలో అంతంత మాత్రంగా సాగుతాయి. అనవసర వస్తువులపై ధనవ్యయం చేస్తారు.

వృషభం: అప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. నూతన వస్తు లాభాలు పొందుతారు. వ్యాపార ఉద్యోగాలలో సకాలంలో నిర్ణయాలు తీసుకుని లాభాలు అందుకుంటారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు.

మిథునం: నూతన కార్యక్రమాలు ప్రారంభించి సకాలంలో పూర్తిచేస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కారం దిశగా సాగుతాయి. అప్తుల నుండి విలువైన సమాచారం సేకరిస్తారు. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. వ్యాపారాల్లో ఆశించిన పురోగతి సాధిస్తారు. వృత్తి ఉద్యోగాలలో సమస్యలను అధిగమిస్తారు.

కర్కాటకం: దూర ప్రయాణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యుల నుండి అవసరానికి సహాయం అందక ఇబ్బంది పడతారు. పాత ఋణాలు తీర్చడానికి చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపార వ్యవహారాలలో ఒడిదుడుకులు తప్పవు. వృత్తి ఉ ద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

సింహం: చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. రావలసిన ధనం సకాలంలో అందక నిరాశ కలుగుతుంది. వ్యాపారాలలో శ్రమ అధికమవుతుంది. వృధా ఖర్చులు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో ఇతరుల నుండి ఊహించని మాటలు వినవలసి వస్తుంది.

కన్య: నూతన వ్యక్తుల పరిచయాలు ఉపయోగపడతాయి. సన్నిహితుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. స్థిరాస్తి క్రయవిక్రయాలలో లాభాలు అందుకుంటారు. వ్యాపారాలలో నూతన ఆలోచనలు అమలు చేసి లాభాలు అందుకుంటారు. వృత్తి ఉద్యోగాలు సంతృప్తికర వాతావరణం ఉంటుంది.

తుల: నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. సమాజంలో పెద్దలతో పరిచయాలు విస్తృతమౌతాయి. బంధు మిత్రులతో వివాదాలు తీరుతాయి. వృత్తి ఉ ద్యోగాలలో పని ఒత్తిడి నుండి ఉపశమనం పొందుతారు.

వృశ్చికం: సోదరులతో స్థిరాస్తి వివాదాలు పెరుగుతాయి. ధన పరంగా ఒడిదుడుకులు అధికమౌతాయి. అధిక శ్రమతో అల్ప ఫలితాన్ని పొందుతారు వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉ ద్యోగపరంగా చేపట్టిన పనులు సకాలంలో పూర్తికాక మానసిక సమస్యలు కలుగుతాయి.

ధనస్సు: నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. ప్రశాంతత కోసం దైవదర్శనం చేసుకోవడం మంచిది. వ్యాపార ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

మకరం: కొన్ని వివాదాలకు సంబంధించి సన్నిహితులు నుండి కీలక సమాచారం అందుతుంది. అనుకున్న పనులు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. నూతన వస్తు లాభాలు పొందుతారు. సమాజంలో పెద్దల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. ఉ ద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

కుంభం: బంధు మిత్రుల మాటలు కొంత ఇబ్బంది కలిగిస్తాయి. అధిక శ్రమతో గాని పనులు పూర్తి కావు. ఇంటాబయట పరిస్థితులు వ్యతిరేకంగా ఉ ంటాయి. ఉదర సంబంధిత అనారోగ్య సమస్యలు కలిగే సూచనలున్నవి. ఉద్యోగాలలో అధికారులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు.

మీనం: కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలను ఆచరణలో పెడతారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. నూతన కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. పాత మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార ఉద్యోగాలలో మరింత పురోగతి కలుగుతుంది.

# సీబీఐ.. సిట్టింగ్ జడ్జి?

**విచారణ బాధ్యత ఎవరికి ఇస్తారో ఇవ్వండి**

**బొగ్గు కుంభకోణంపై గవర్నర్ కు బీఆర్ఎస్ ఫిర్యాదు**

**తెలంగాణలో సీఎం అంటే కోల్ మాఫియా**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్, జనవరి 27 (ఈవార్తలు): బొగ్గు కుంభకోణంపై తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. సీబీఐకి ఇస్తారా? సిట్టింగ్ జడ్జికి ఇస్తారా? మీ ఇష్టం ఎవరికి ఇస్తారో ఇవ్వండి అని గవర్నర్ ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరినట్లు తెలుస్తోంది. ఏ వయసులో ముచ్చట ఆ వయసులో జరగాలి. చదువు కోవాల్సిన టైంలో చదువుకోక ఇప్పుడు చదువుకుంటానంటే ఏం వస్తదో ఒకసారి వారు కూడా ఆలోచించుకోవాలి అంటూ సీఎం రేవంత్ రెడ్డి హార్వర్డ్ పర్యటనపై కేటీఆర్ సెటైర్లు వేశారు. 'అని కేటీఆర్ సెటైర్లు వేశారు. ఇవాళ సీఎం అంటే తెలంగాణలో చీఫ్ మినిస్టర్ కాదు సీఎం అంటే కోల్ మాఫియా కి నాయకుడుగా మారారు అని ఎద్దేవా చేశారు.సింగరేణిలో జరుగుతున్న దోపిడీ విషయంలో కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఫిర్యాదు చేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడారు. ఈ కుంభకోణాన్ని, రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా సింగరేణి ప్రాంతంలో ఉండే మా కార్మిక సోదరులు కూడా అర్థం చేసుకుంటే... చాలా స్పష్టంగా ఆధారాలతో సహా మేము బయట పెట్టిన తర్వాత, ముఖ్యంగా మేము లేవనెత్తిన కొన్ని ప్రశ్నల విషయంలో ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఒక్క సమాధానం కూడా రావడం లేదు అని విమర్శించారు.ఈ విషయంలో స్పందించాల్సిన ముఖ్యమంత్రి గారేమో అప్పుడప్పుడు ఫుట్ బాల్ ఆడుతున్నాడు సింగరేణితో... లేదా ఇవాళ విదేశాల్లో తిరుగుతూ ఏదో పాఠాలు నేర్చుకుంటున్నా అంటూ ఫోజులు కొడతా ఉన్నాడు అని కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, ముఖ్యంగా సింగరేణిలో జరుగుతున్న దోపిడీ విషయంలో గవర్నర్ కి ఫిర్యాదు చేయడం జరిగింది అని కేటీఆర్ వెల్లడించారు. సింగరేణిలో అవినీతి జరుగుతున్నదని ఆధారాలతో సహా మాజీమంత్రి హరీశ్ రావు మీడియా సమావేశంలో ఆధారాలతో సహా బయటపెట్టారని అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలో వణుకు మట్నదలైంది అని కేటీఆర్ చెప్పుకొచ్చారు. మీడియా కూడా మాకు సహకరించి ఈ కుంభకోణాన్ని పూర్తిస్థాయిలో బట్టబయలు చేసేసరికి పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి అని అన్నారు. కేవలం మాట్లాడటమే కాదు ఆధారాలతో సహా మరి ఈ రోజు పూర్తిస్థాయిలో ఈ కుంభకోణాన్ని బట్టబయ లు చేసినం. దాన్ని డైవర్ట్ చేయడానికి, ప్రజల అటెన్షన్ని, దృష్టి మళ్లించడానికి, విచారణ పేరిట ఇవాళ ఒకరి తర్వాత ఒకరిని పిలుస్తునారు అని మండిపడ్డారు.

### ఫుట్ బాల్ కోసం 10 కోట్లు దుర్వినియోగం

పది కోట్ల రూపాయలు సింగరేణి నిధులు, సింగరేణి సంస్థకు సంబంధించిన నిధులు దుర్వినియోగం చేసి, మీరు ఫుట్ బాల్ ఆటకి వినియోగించడం జరిగింది. ఈ రాష్ట్ర ప్రజలతో మీరు ఎలాగూ ఫుట్ బాల్ ఆడుతున్నారు కానీ సింగరేణి సంస్థతో కూడా ఫుట్ బాల్ ఆడుతూ పది కోట్ల రూపాయలు దుర్వినియోగం చేసి ఈరోజు ఆ సంస్థకి తీరని అన్యాయం చేసిందు రేవంత్ రెడ్డి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మండిపడ్డారు. ఒక్క స్కామ్ కి సంబంధించి ఇన్ని ఆధారాలు బయటపెడితే కూడా స్కామ్ కు సంబంధించి ఇప్పటివరకు పాలకుల వైపు నుంచి సమాధానం లేదు.టెండర్ల విషయంలో గతంలో ఎన్నడూ లేని 'సైట్ విజిట్ సర్టిఫికేషన్' అంటే మీరు సైట్ మీదకి రావాలి,.అక్కడికి వచ్చినట్టు సర్టిఫికెట్ తీసుకోవాలి అన్న నిబంధన పారదర్శకతకు పాతరవేసి ఎందుకు పెట్టినారు అని కేటీఆర్ చెప్పుకొచ్చారు.'గతంలో ఎన్నడూ లేని విధంగా ఇది ఎందుకు పెట్టారంటే ఇంతవరకు సమాధానం లేదు. భారతదేశంలో ఎక్కడ ఏ కోల్ గనిలో లేని, ఏ బొగ్గు గనిలో లేని నిబంధన ఇక్కడనే ఎందుకు పెట్టినారు అంటే ఇంతవరకు సమాధానం రాదు. అట్లాగే నిజంగానే 2018 నుంచి 2024 వరకు ఈ నిబంధన గనుక కేంద్ర ప్రభుత్వం ఒకవేళ సిఫారసు చేసి ఉంటే ఆ రోజున్న బిఆర్ఎస్ (దీ=హా) ప్రభుత్వం అమలు చేయలేదు.అన్ని టెండర్లను కూడా ట్రాన్స్పరెంట్ గా ఆనాడు మేము పిలిచినాం'అని కేటీఆర్ మండిపడ్డారు. అందుకే ఆరోజు అన్ని మైనస్ టెండర్లు వచ్చినాయి. ఎస్టిమేటెడ్ కాస్ట్ కంటే తక్కువ ఖర్చుకే సింగరేణికి డబ్బు ఆదా చేస్తూ ఆరోజు జరిగిన మాట వాస్తవమా కాదా 'అని కేటీఆర్ ప్రశ్నించారు. 'టెండర్లలో లేని షరతు మీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ 'సైట్ విజిట్ సర్టిఫికేషన్' అనే విధానం ఎందుకు పెట్టారు ఎవరికి లాభం చేయడానికి నిబంధన అప్పటి నుంచి తొమ్మిది నెలల్లో ఎన్ని సంస్థలు ఇప్పటివరకు ఎంతమంది కాంట్రాక్టర్లు సైట్ సందర్శించారు మీకు ఎన్ని ఈమెయిల్స్ వచ్చాయి ఎన్ని లేఖలు వచ్చాయి ఎన్ని సర్టిఫికేట్లు సింగరేణి సంస్థ జారీ చేసింది 'అని కేటీఆర్ పేర్కొన్నారు.'ఒక వైట్ పేపర్ (శ్వేత పత్రం) ప్రచురించండి అని మేము డిమాండ్ చేస్తే ఇంతవరకు సమాధానం లేదు.కొంతమందికే సెలెక్టివ్ గా ఎందుకు ఇచ్చారు మీరు కొంతమందికే సెలెక్టివ్ గా మీరు ఎందుకు మరి కొంతమంది కాంట్రాక్ట్ సంస్థలనే ఎందుకు మీరు ఎన్నుకుంటున్నారు . మిగతా వాళ్ళని ఎందుకు పక్కన పెడుతున్నారు . ఇందులో రింగ్ మాస్టర్, సృజన్ రెడ్డి అనే వ్యక్తి ముఖ్యమంత్రి బావమరిది అవునా.. కాదా అని మేము అడిగితే ఇంతవరకు సమాధానం రాదు, ఇంతవరకు ఆయన విషయంలో స్పష్టత రాదు'అని కేటీఆర్ మండిపడ్డారు. 'ఒక నైనీ నీ బొగ్గు గని టెండర్లే కాదు.. అన్ని టెండర్లకు పారదర్శకత ఉండాలి. నైనీలో కూడా గతంలో 2021లో, 2022లో రెండు సార్లు మా ప్రభుత్వం ఉన్నప్పుడు టెండర్లు పిలిచాం. కానీ ఆ రోజు ఈ 'సైట్ విజిట్ సర్టిఫికేట్' అనే నిబంధన లేదు. మరి ఈ రోజు బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవసరం లేనిది, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ నిబంధన ఎందుకు అవసరమైంది 'అని కేటీఆర్ నిలదీశారు. 'సోలార్ పవర్ స్కామ్ గురించి కూడా మేము బయట పెట్టాం. భారతదేశంలో ఎక్కడైనా మెగావాట్ కు రెండున్నర నుంచి మూడు కోట్లలో ఇవాళ సోలార్ నిర్మాణం జరుగుతా ఉన్నది. కానీ తెలంగాణలో మాత్రం సింగరేణి పిలిచిన సోలార్ టెండర్లలో మాత్రం ఏడు కోట్లు. రెండున్నర మూడు కోట్లలో అయ్యే పని దేశం మొత్తంలో ఒక్క తెలంగాణలో మాత్రం ఏడు కోట్లు ఎందుకు అవుతున్నది 'అని కేటీఆర్ నిలదీశారు.'ఇది స్కామ్ కాదా సోలార్ పవర్ లో అని మేము నిలదీస్తే ఇంతవరకు సమాధానం లేదు.అట్లాగే ఎక్స్ ప్లోజివ్స్, జిలెటిన్ స్టిక్స్, 30 శాతం అదనంగా రేటు పెం చారు. డైరెక్టర్లు నిలదీస్తే బోర్డులో, వాళ్ళ మీద యాక్షన్ తీసు కున్నారు.. తప్ప కాంట్రాక్టర్లకు లాభం చేసే పనిలో మాత్రం కాంగ్రెస్ పార్టీ వెనకకు తగ్గలేదు. ఈ అన్ని విషయాలు గవర్నర్ దృష్టికి తీసుకు వచ్చినం అని కేటీ ఆర్ మండిపడ్డారు. 'కాంట్రాక్టర్లను బెదిరించి, కాంట్రా క్టర్లను ఒక రింగు చేసి ఇవాళ ప్రజా ధనాన్ని దోచు కుంటున్న తీరును వివరించడం జరిగింది.ఇవాళ గవర్నర్ని అడిగాము. సార్ మీరైనా ఇన్వాల్వ్ కాండి లేదా కిషన్ రెడ్డికి ఆదేశం ఇవ్వండి. సిబిఐకి ఇస్తారా సిట్టింగ్ జడ్జికి ఇస్తారా మీ ఇష్టం ఎవరికి ఇస్తారో ఇవ్వండి'అని కేటీఆర్ ధ్వజమెత్తారు.కానీ ప్రజా ధనాన్ని కొల్లగొట్టే ఈ దుర్మార్గపు వ్యవస్థను, అటు సోలార్ పవర్ లో కుంభకోణం, ఇటు సింగరేణి ఓబి గనుల్లో కుంభకోణం.. దీన్ని అడ్డుకోండి అని గవర్నర్ కి విజ్ఞప్తి చేస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

# ఈయూతో డీల్!

**మొదటి పేజీ తరువాయి**

అభివర్ణించారు. ఈ ఒప్పందం ఖరారైతే ఇరు ఆర్థిక వ్యవస్థల మధ్య తయారీ, సేవా రంగాలకు భారీ ఊతం లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇండియన్ ఎనర్జీ వీక్ సదస్సులో వర్చువల్?గా ప్రసంగించిన ప్రధాని, ఈ ఒప్పందంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోందని తెలిపారు. "భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య ఒక చరిత్రాత్మక ఒప్పందం కుదరబోతోంది. ప్రపంచంలోని అనేక దేశాలు దీనిని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా చర్చిస్తున్నాయి. ఈ డీల్ 140 కోట్ల మంది భారతీయులకు, యూరప్?లోని లక్షలాది ప్రజలకు అపారమైన అవకాశాలను సృష్టిస్తుంది" అని మోదీ అన్నారు. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య సహకారానికి ఈ ఒప్పందం ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధాని పేర్కొన్నారు. ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో (జీడీపీ) దాదాపు 25 శాతం, ప్రపంచ వాణిజ్యంలో మూడింట ఒక వంతు వాటా ఈ ఒప్పంద పరిధిలోకి వస్తుందని వివరించారు. ఈ డీల్ ద్వారా భారత్?లోని టెక్స్?టైల్స్, జెమ్స్ అండ్ జ్యూవెలరీ, లెదర్ వస్తువుల వంటి రంగాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ ఒప్పందం కేవలం వాణిజ్యానికే కాకుండా ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలన వంటి ఉమ్మడి విలువల పట్ల నిబద్ధతను కూడా బలపరుస్తుందని మోదీ స్పష్టం చేశారు. భారత్-యూకే వాణిజ్య ఒప్పందానికి ఈ డీల్ అదనపు బలాన్ని ఇస్తుందని ఆయన జోడించారు.

### ఏవేవి చౌకగా మారనున్నాయంటే?

భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. సుమారు 18 ఏళ్ల సుదీర్ఘ చర్చల అనంతరం కుదిరిన ఈ ఒప్పందం వల్ల యూరప్ నుంచి దిగుమతి అయ్యే లగ్జరీ కార్లు, వైన్లు, స్పిరిట్స్ (పలు రకాల మద్యం), పలు రకాల ఆహార పదార్థాలు, ఔషధాల ధరలు రాబోయే కొన్నేళ్లలో గణనీయంగా తగ్గనున్నాయి. ఈ ఒప్పందంలో అత్యంత కీలకమైన అంశం లగ్జరీ కార్లపై దిగుమతి సుంకాల కోత. ప్రస్తుతం 110 శాతం వరకు ఉన్న దిగుమతి సుంకాన్ని ఏటా 2.5 లక్షల కార్ల కోటా పరిమితికి లోబడి, దశలవారీగా 10 శాతానికి తగ్గించనున్నారు. అయితే, ఈ ప్రయోజనం రిటైల్ ధర సుమారు రూ. 25 లక్షల కంటే ఎక్కువ ఉండే కార్లకు మాత్రమే వర్తిస్తుంది. దేశీయ ఆటోమొబైల్ తయారీదారులను రక్షించేందుకు, తక్కువ ధర కలిగిన కార్లను ఈ ఒప్పందం పరిధి నుంచి మినహాయించారు. మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడి, పోర్షే వంటి యూరప్ లగ్జరీ కార్ బ్రాండ్లకు ఈ ఒప్పందం ఎంతో ప్రయోజనకరం కానుంది. ఈ సుంకాల కోత సుమారు ఐదేళ్లలో దశలవారీగా అమలవుతుంది. కార్లతో పాటు మద్యం ప్రియులకు కూడా ఈ ఒప్పందం తీపికబురు అందించింది. ప్రీమియం యూరోపియన్ వైన్లపై దిగుమతి సుంకాన్ని 150 శాతం నుంచి 20-30 శాతానికి తగ్గించనున్నారు. విస్కీ వంటి స్పిరిట్స్ పై సుంకాన్ని 40 శాతానికి, బీర్లపై సుంకాన్ని 50 శాతానికి పరిమితం చేయనున్నారు. వీటితో పాటు ఆలివ్ ఆయిల్, మార్జరిన్ వంటి వంట నూనెలపై సుంకాన్ని పూర్తిగా ఎత్తివేయనున్నారు. చాక్లెట్లు, బిస్కెట్లు, పాస్తా, బ్రెడ్ వంటి ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలపై ప్రస్తుతం ఉన్న 50-55 శాతం సుంకాన్ని పూర్తిగా తొలగించనున్నారు. దీంతో యూరప్ నుంచి వచ్చే అనేక ప్యాకేజ్డ్ ఫుడ్స్ ధరలు సామాన్యులకు అందుబాటులోకి రానున్నాయి. ఆరోగ్య రంగంలోనూ ఈ ఒప్పందం సానుకూల ప్రభావం చూపనుంది. యూరప్ నుంచి దిగుమతి అయ్యే అనేక ఫార్మా ఉత్పత్తులపై ప్రస్తుతం ఉన్న 11% సుంకాన్ని దాదాపుగా సున్నాకు తగ్గించనున్నారు. దీంతో పాటు, సుమారు 90 శాతం ఆప్టికల్, మెడికల్, సర్జికల్ పరికరాలపై సుంకాన్ని పూర్తిగా రద్దు చేయనున్నారు. ఇది దేశంలో వైద్య పరికరాల ధరలను తగ్గించి, ఆధునిక చికిత్సలను మరింత అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉంది. ఈ చారిత్రక ఒప్పందంపై మంగళవారం సంతకాలు జరిగాయి. ఇరు పక్షాల ఆమోద ప్రక్రియలు పూర్తయ్యాక 2027 నుంచి ఇది అమల్లోకి వస్తుందని భావిస్తున్నారు. అయితే, ఈ సుంకాల తగ్గింపు ఒక్కసారిగా కాకుండా 3, 5, 7 ఏళ్ల వ్యవధిలో దశలవారీగా జరుగుతుంది. అంతేకాకుండా, దిగుమతి సుంకాలు తగ్గినా.. తుది రిటైల్ ధరలు జీఎస్టీ, రవాణా ఛార్జీలు, విదేశీ మారకపు రేట్లు, కంపెనీల ధరల నిర్ణయాలపై కూడా ఆధారపడి ఉంటాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## ఐదు గంటల పాటు సంతోష్ విచారణ

**మొదటి పేజీ తరువాయి**

ఎవరిదని ప్రశ్నించినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి ఆధారాలను ముందుంచి సిట్ ఆయనను ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ప్రభాకర్ రావుకు ఇంటెలిజెన్స్ చీఫ్, ఎస్ఐబీ చీఫ్? బాధ్యతలు అప్పగించడంలో నిర్ణయం, ఆదేశాలు ఎవరు ఇచ్చారనే అంశంపై సంతోష్ రావును సిట్ ప్రశ్నించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ఇదివరకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావును విచారించిన విషయం విదితమే.

# మేడారానికి బయల్దేరిన పగిడిద్ద రాజు

**మొదటి పేజీ తరువాయి**

పూనుగొండ్ల గ్రామంలో ఘనంగా ప్రారంభమైంది. వనదేవత సమ్మక్క భర్త అయిన పగిడిద్దరాజు కొలువైన ఈ గ్రామంలో మంగళవారం వేకువజామునే పూజారులు పెనుక రాజేశ్వర్ ఆధ్వర్యంలో ఆలయాన్ని శుద్ధి చేసి, మామిడి తోరణాలు, పూలమాలలు కట్టగా.. ఆడపడుచులు గుడి ప్రాంగణంలో ముగ్గులు వేశారు. అనంతరం గ్రామానికి చెందిన పెనుక వెంకటేశ్వర్లు ఇంటి నుంచి పాన్పు రూపంలో ఉన్న పగిడిద్దరాజును శివసత్తుల పూనకాలు, డోలు వాయిద్యాలు, భజనలు, నినాదాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయంలో పగిడిద్దరాజుకు సంబంధించిన మువ్వలు, గంటలు, గజ్జెలు శుభ్రపరచి దూపదీప నైవేద్యాలు సమర్పించి, ఆదివాసీ సంప్రదాయ రీతిలో రహస్య పూజలు నిర్వహించారు. అనంతరం పగిడిద్దరాజును పడగ రూపంలో పెళ్లికొడుకుగా ముస్తాబు చేసి, సుమారు 62 కిలోమీటర్ల దూరంలో ఉన్న మేడారానికి అడవి మార్గం గుండా కాలినడకన బయల్దేరారు. ఈ యాత్రలో భాగంగా మంగళవారం రాత్రి ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం లక్ష్మీపురంలో బస చేయగా.. బుధవారం సాయంత్రం వరకు మేడారం చేరుకుని పగిడిద్దరాజును గద్దెపై ప్రతిష్ఠించనున్నారు. ఈ పవిత్ర యాత్రలో పూజారులు పెనుక రాజేశ్వర్, సురేందర్, సమ్మయ్య, రామస్వామి, పురుషోత్తం, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

### జాతరకు సర్వం సిద్ధం

జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నాలుగు రోజుల వేడుకకు దేశం నలుమూలల నుంచి సుమారు రెండు కోట్లకు పైగా భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ కు దాదాపు 240 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గిరిజన పుణ్యక్షేత్రం ఇప్పటికే జనసంద్రంగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా సహా పలు రాష్ట్రాల నుంచి గిరిజనులు, గిరిజనేతరులు ఈ జాతరకు పోటెత్తుతున్నారు. ఇప్పటికే గత కొద్ది రోజులుగా దాదాపు 10 లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. వనదేవతలైన సమ్మక్క, సారలమ్మల వీరత్వాన్ని, త్యాగాన్ని స్మరించుకుంటూ రెండేళ్లకోసారి ఈ జాతరను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ ఏడాది జాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 251 కోట్లు ఖర్చు చేసింది. 21 శాఖలకు చెందిన 42,000 మందికి పైగా అధికారులు, సిబ్బందిని, 2000 మంది ఆదివాసీ వాలంటీర్లను భక్తుల సేవ కోసం నియమించారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా 13,000 మంది పోలీసులను మోహరించారు. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత డ్రోన్లతో జాతరను పర్యవేక్షిస్తున్నారు. 1,418 ఎకరాల్లో 42 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. జంపన్న వాగు వద్ద 200 మంది గజ ఈతగాళ్లను, 30 వైద్య శిబిరాల్లో 5,192 మంది వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పారిశుధ్యం కోసం 5,000 మంది కార్మికులు, 5,700 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. భక్తుల రవాణా కోసం టీజీఎస్ఆర్టీసీ 4,000 ప్రత్యేక బస్సులను, దక్షిణ మధ్య రైల్వే 28 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. పర్యాటక శాఖ హనుమకొండ నుంచి మేడారానికి హెలికాప్టర్ సేవలను కూడా అందిస్తోంది. రౌండ్ ట్రిప్ తో కూడిన వీఐపీ దర్శనానికి రూ. 35,999, జాతర ఏరియల్ వ్యూ కోసం ఒక్కొక్కరికి రూ. 4,800 చొప్పున ఛార్జీలను నిర్ణయించారు.



## అసలు రాక్షసుడు సంతోషే!

**మొదటి పేజీ తరువాయి**

ప్రకటించారు. నిజామాబాద్ జిల్లాలో గంజాయి రవాణా చేస్తున్న ముఠా కారుతో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను నిమ్స్?లో పరామర్శించిన అనంతరం కవిత మాట్లాడారు. "ఒక గంజాయి బ్యాచ్?కు ఎక్సైజ్ కానిస్టేబుల్?ను చంపడానికి ప్రయత్నించేంత ధైర్యం ఉందంటే, వారికి ప్రభుత్వంపై ఏమాత్రం భయం లేదని స్పష్టమవుతోంది" అని ఆమె అన్నారు. రాష్ట్రాన్ని డ్రగ్స్, గంజాయి రహితంగా మారుస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇప్పుడు గ్రామాల్లో, పాఠశాలల్లో కూడా గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా దొరుకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్, గంజాయి కారణంగా గృహహింస ఘటనలు కూడా పెరుగుతున్నాయని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్, ఫారెస్ట్ శాఖ సిబ్బందికి ఆయుధాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారికి తుపాకీ ఫైరింగ్?తో సహా శిక్షణ ఇస్తున్నప్పటికీ, ఆయుధాలు అందించడం లేదని, వారి వద్ద ఆయుధాలు ఉంటే గంజాయి, డ్రగ్స్ మాఫియాకు కనీసం భయమైనా ఉంటుందని కవిత అభిప్రాయపడ్డారు.

## 11న పుర పోలింగ్

**మొదటి పేజీ తరువాయి**

స్పష్టం చేశారు.ఎన్నికలు పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశామని స్పష్టం చేశారు. పోలీస్ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి భద్రత కల్పించనున్నట్లు తెలిపారు. కాగా, మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదల కావడంతో రాజకీయ పార్టీలు సమరానికి సై అంటున్నాయి. ఈనెల 28న నోటిఫికేష్ విడుదల కావడం అదే రోజు నుంచి 30వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. ఇప్పటికే మున్సిపల్ ఎన్నికలను అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మంగా తీసుకున్నాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు ఈ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నాయి. మరోవైపు బీజేపీ సైతం పట్టుకోసం గట్టిగానే ప్రయత్నిస్తోంది. ఇక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఇక తెలంగాణ రాజకీయం మరింత రసవత్తరంగా మారే అవకాశం లేకపోలేదు.

**నోటిఫికేషన్ షెడ్యూల్:**

నోటిఫికేషన్ విడుదల: 28-01-2026
నామినేషన్ల స్వీకరణ: 28-01-2026
నామినేషన్ల దాఖలుకు చివరి తేది:30-01-2026
నామినేషన్ల పరిశీలన:31-01-2026
నామినేషన్లపై అభ్యంతరాలు:01-02-2026
అభ్యంతరాలపై పరిష్కారం:02-02-2026
నామినేషన్ల ఉపసంహరణ గడువు:03.02-2026
బరిలో ఉన్న అభ్యర్థుల జాబితా విడుదల:03-02-2026
పోలింగ్: 11-02-2026
రీపోలింగ్- 12-02-2026
కౌంటింగ్:13-02-2026 (ఉదయం 8 గంటల నుండి)



# నేటి నుంచి మేడారం జాతర







## అసెంబ్లీకి జపాన్ బృందం

**స్పీకర్, చైర్మన్‌తో భేటీ**

హైదరాబాద్, జనవరి 27 (ఈవార్తలు): తెలంగాణ శాసనసభను జపాన్ దేశంలోని అయిచి రాష్ట్ర అసెంబ్లీ సభ్యుల బృందంతో కూడిన అయిచి ఎకనామిక్ డెవలప్మెంట్ ఫోరం బృందం మంగళవారం సందర్శించింది. ఫోరం చైర్మన్ హిరిహితో కోండో, తొమ్మిది మంది అయిచి రాష్ట్ర ఎమ్మెల్యేల బృందానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్పీకర్ ఛాంబర్ లో సమావేశమైన తెలంగాణ- అయిచి రాష్ట్ర సభ్యుల బృందం, వివిధ రంగాలలో సహకారంపై చర్చించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రాంతం సంస్కృతి, సాంప్రదాయాలు ఉన్నతమైనవి.. తెలంగాణ 2014 లో నూతనంగా ఏర్పడినదని.. శాసనసభలో 119 మంది సభ్యులు, శాసన మండలిలో 40 మంది సభ్యులు ఉన్నారని వివరించారు. ఎమ్మెల్యేలను ఎన్నికల ద్వారా నేరుగా ప్రజలు ఎన్నుకుంటారు.. తెలంగాణ అసెంబ్లీలో చర్చలు అర్ధవంతంగా జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ నినాదంతో తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడానికి కృషి చేస్తున్నారు.. తెలంగాణలో పెట్టుబడులకు మంచి అవకాశాలు ఉన్నాయని గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ భారత్, జపాన్ దేశాల మధ్య మొదటి నుంచి చారిత్రక స్నేహ సంబంధాలు ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రం నూతనంగా ఏర్పడినప్పటికీ పెట్టుబడులకు అన్ని విధాలుగా మంచి వాతావరణం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా జపాన్ బృంద సభ్యులకు పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండలి కార్యదర్శి వి. నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి, అధికారులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ సౌమ్య పరిస్థితి విషమం

నిజామాబాద్, జనవరి 27 (ఈవార్తలు): నిజామాబాద్ జిల్లాలో గంజాయి ముఠాను అడ్డుకునే క్రమంలో కారుతో ఢీకొట్టబడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. హైదరాబాద్‌లోని నిమ్స్ వైద్యులు తాజాగా విడుదల చేసిన హెల్త్ బులిటెన్‌లో ఆమె ఆరోగ్య స్థితిని వివరించారు. నిమ్స్ వైద్యుల ప్రకారం, కారు కడుపు పైభాగానికి ఢీకొట్టడంతో లివర్, కిడ్నీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పక్కటెముకలు విరిగిపోయాయి. ఎడమ కిడ్నీని తొలగించాల్సి వచ్చింది. ఇప్పటికీ ఆమె పరిస్థితి విషమంగానే ఉంది. అయితే, వైద్యానికి సహకరిస్తున్నారని వైద్యులు తెలిపారు. ఆమెను ఐసీయూలో ఉంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు వెల్లడించారు. రక్తనాళాలు, శ్వాసకోశ వ్యవస్థలపై కూడా ప్రభావం పడింది. మరిన్ని టెస్టులు, చికిత్సలు కొనసాగుతున్నాయి. శుక్రవారం నిజామాబాద్ జిల్లాలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, గంజాయి ముఠా సభ్యులు కారుతో సౌమ్యను ఢీకొట్టారు. తీవ్ర గాయాలపాలైన ఆమెను మొదట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎక్సైజ్ శాఖ అధికారులు దర్యాప్తు చేపట్టారు. గంజాయి ముఠా సభ్యులను పట్టుకోవడానికి ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశారు.

# రాహుల్ గాంధీ సింహంలాంటోడు

**ఎక్కడ కూర్చున్నా అదే సింహాసనం.. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

హైదరాబాద్, జనవరి 27 (ఈవార్తలు): గణతంత్ర వేడుకల్లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని మూడో వరుసలో కూర్చోబెట్టడంపై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పందించారు. సింహం ఎక్కడ కూర్చుంటే అదే సింహాసనం అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాజకీయ సంప్రదాయం గతంలో ఎలా ఉండేది, ఇప్పుడు ఎలా ఉందో గమనించాలని ఆయన కోరారు. స్వాతంత్రానంతరం నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ ఆనవాయతీని కొనసాగించారని జగ్గారెడ్డి గుర్తు చేశారు. ప్రధానమంత్రి జెండా ఎగురవేస్తే ప్రతిపక్ష నాయకుడిని మొదటి వరుసలో కూర్చోబెట్టేవారని, అది రాజ్యాంగం ఇచ్చిన మర్యాద, ప్రజలు ఇచ్చిన హక్కు అని ఆయన అన్నారు. ప్రస్తుత గణతంత్ర వేడుకల్లో రాహుల్ గాంధీని మూడో వరుసలో కూర్చోబెట్టి అవమానపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రవర్తనను ప్రజలు గమనించాలని ఆయన కోరారు. మోదీ ప్రభుత్వం సంప్రదాయాలను పక్కన పెట్టిందని ఆయన విమర్శించారు. రాహుల్ గాంధీ మూడో వరుసలో కూర్చున్నందుకు బాధపడరని, ఎందుకంటే ప్రధాని పదవి ఆయన ఇంట్లో పుట్టిందని అన్నారు. నరేంద్ర మోదీ ఇంట్లో ప్రధానమంత్రి పదవి పుట్టలేదని ఆయన ఎద్దేవా చేశారు. న్యాయమైన పాలన, పేదలకు అండగా ఉ



ండే పాలనను రాహుల్ గాంధీ కుటుంబమే అందించిందని జగ్గారెడ్డి అన్నారు. కాబట్టి ఆయనను మూడో వరుసలో కాదు, ఐదవ వరుసలో కూర్చోబెట్టిన బాధపడరని ఆయన వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ కుటుంబం దేశాన్ని 47 సంవత్సరాలు పాలించిందని గుర్తుంచుకోవాలని అన్నారు. ఇప్పుడు మాత్రం పద్ధతి లేని పాలన కనిపిస్తోందని ఆయన విమర్శించారు. రాహుల్ గాంధీ ఆలోచన, మాట తీరు, ప్రవర్తన అన్నీ సింహంలా ఉంటాయని ఆయన అన్నారు. సింహానికి సింహాసనం అవసరం లేదని, సింహం ఎక్కడ కూర్చుంటే అదే సింహాసనం అవుతుందని ఆయన అన్నారు. మోదీ సింహాసనం మీద కూర్చుంటేనే ప్రధాని అవుతారని ఆయన విమర్శించారు. ప్రియాంక గాంధీ పార్లమెంటులో మోదీని పులిలా వేటాడుతోందని అన్నారు. మంచి పాలన ఇవ్వమని బీజేపీకి ప్రజలు అధికారం ఇచ్చారని, కానీ రాహుల్ గాంధీ కుటుంబాన్ని ఇబ్బంది పెట్టమని కాదని ఆయన వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ కుటుంబంపై రాజకీయ కుట్రలు మానుకోవాలని హితవు పలికారు. వాజపేయి లాంటి వారు పార్లమెంటులో ఉండాలని, ప్రతిపక్షంలో ఆయనలాంటి వారు ఉంటేనే అన్ని అంశాలు చర్చకు వస్తాయని ఇందిరా గాంధీ గౌరవం ఇచ్చారని గుర్తు చేశారు. వాజపేయి, అద్వానీ లాంటి వారిని మొదటి వరుసలో కూర్చోబెట్టి ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ గౌరవించారని అన్నారు. ఇప్పుడు సంప్రదాయాలను ఎందుకు పక్కన పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడున్న జనరేషన్‌కు మీరు ఏం చెప్పదలుచుకున్నారని ఆయన నిలదీశారు. బీజేపీ వారు ధర్మం అంటారని, కానీ పాటించరని, దేవుడు అంటారు కానీ పద్ధతులు పాటించరని ఆయన విమర్శించారు. ప్రధానమంత్రులు వస్తారు.. పోతారు, కానీ చరిత్రను రాయలేరని అన్నారు. ఒక నిజాంను వదిలేసి మిగిలిన నిజాం నవాబులను ప్రజలు గుర్తు చేసుకుంటారని పేర్కొన్నారు. బీజేపీ ఎంతసేపూ ప్రజల్లోకి చెడను ఎలా చొప్పించాలనే చూస్తోందని ఆరోపించారు. ప్రజలను ట్రాప్ చేయడం ఎలా అనేది బీజేపీ పాలసీ అని, అంతకుమించి ఏమీ లేదని ఆయన విమర్శించారు.



## తెలంగాణలో 994 పులులు!

హైదరాబాద్, జనవరి 27 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర అటవీశాఖ ఆధ్వర్యంలో పులుల గణన సర్వే (ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్--2026) విజయవంతంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా జనవరి 19 నుంచి 25 వరకు ఆరు రోజులపాటు శాస్త్రీయ పద్ధతుల్లో ఈ సర్వే చేపట్టారు. సమ్మక్క--సారలమ్మ జాతర నేపథ్యంలో ములుగు జిల్లాను మినహాయించి, 32 జిల్లాల్లోని అన్ని బీట్‌లలో సర్వే పూర్తి చేసినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. సర్వేలో భాగంగా 15 కిలోమీటర్ల మేర కార్నివోర్ సైన్ సర్వే, రోజుకు 2 కిలోమీటర్ల ట్రాన్సెక్ట్ సర్వే నిర్వహించి అటవీ వృక్షజాలం, ఆహార జంతువుల సాంద్రతను అంచనా వేశారు. క్షేత్ర స్థాయిలో సేకరించిన సమాచారాన్ని వీ-ూ=ఖూజూ యాప్‌లో నమోదు చేసి, వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా రిమోట్ సర్వర్‌కు అప్‌లోడ్ చేశారు. ప్రాథమిక గణాంకాల ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా పులులు, ఇతర మాంసాహార జంతువుల ఉనికికి సంబంధించి 994 ఆధారాలు లభించాయి. అలాగే 552 పెద్ద శాకాహార జంతువులకు సంబంధించిన ఆధారాలను అధికారులు గుర్తించారు. ఇతర వన్యప్రాణుల ఆనవాళ్లు కూడా పెద్ద సంఖ్యలో లభ్యమయ్యాయి. ఈ సర్వేలో 4,512 మంది అటవీ శాఖ సిబ్బందితో పాటు దేశ నలుమూలల నుంచి వచ్చిన 1,677 మంది వాలంటీర్లు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల సొంతింటి కల సాకారం చేస్తాం

**సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: భట్టి విక్రమార్క**

హైదరాబాద్, జనవరి 27 (ఈవార్తలు): సింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, అధికారులతో సమానంగా సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో సింగరేణి కార్మికుల కోసం తాజాగా చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ, సింగరేణి ఉద్యోగుల మారుపేరు విషయానికి సంబంధించి తొందరగా పరిష్కారం చేస్తామని, మెడికల్ ఇన్ వాల్యుయేషన్ వారికి జబ్బులకు సంబంధించి బోర్డు ఉన్న అన్ని విధాల పరిష్కారం చేస్తుందన్నారు. కోల్ ఇండియా నిబంధన మేరకు సింగరేణిలో అధికారుల సంబంధించిన అన్ని సౌకర్యాలను భరిస్తుంది.. అదేవిధంగా సింగరేణి కార్మికులకు కూడా అన్ని సౌకర్యాలు (టాక్స్) కల్పించడం కోసం ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేస్తుందని స్పష్టం చేశారు. కార్మికులు, ఉద్యోగుల సొంతింటి కల నెరవేర్చడానికి ప్రభుత్వ ఐఫోర్ కమిటీ నిర్ణయించిందని, సింగరేణి ఉద్యోగులకు దేశంలో ఎక్కడా లేని రీతిలో 1.25 కోట్ల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కల్పించినట్టు తెలిపారు. ఈ బీమా పథకం దేశవ్యాప్తంగా ఒక నమూనా పథకంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. అక్కడ పనిచేస్తున్న 30 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల కోసం రూ. 40 లక్షల ఉచిత ప్రమాద బీమా పథకం అమలు చేయడం జరిగిందని తెలిపారు. కారుణ్య నియామకాల్లో వారసుల గరిష్ట వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత 2,539 పోస్టులను భర్తీ చేసినట్లు, వీటిలో 798 ఎక్స్ టర్నల్ పోస్టులు ఉండగా 1,741 కారుణ్య నియామక ఉద్యోగాలను ఇచ్చామన్నారు. క్యాథ్ ల్యాబ్‌ల ఏర్పాటు ద్వారా ఆసుపత్రులను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులుగా మార్చేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. 2024-25 లో సింగరేణి చరిత్రలో అత్యధిక లాభాలు రూ. 6,394 కోట్లు సాధించామని, అత్యధికంగా 34 శాతం లాభాల వాటా కింద రూ. 802 కోట్లు కార్మికులకు చెల్లించడం జరిగింది. పొరుగు సేవల సిబ్బందికి రూ.5,500 చొప్పున లాభాల వాటా చెల్లించామని తెలిపారు.

## నేను, రఘునందన్ రావు కలిస్తే బీఆర్ఎస్ గల్లంతు

**నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్**

హైదరాబాద్, జనవరి 27 (ఈవార్తలు): మెదక్ ఎంపీ రఘునందన్ రావుతో తాను కలిస్తే బీఆర్ఎస్ గల్లంతవడం ఖాయమని నిజామాబాద్ ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అరవింద్ అన్నారు. మున్సిపల్ ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని, మెజారిటీ స్థానాలు తామే గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఏ పార్టీలోనైనా గ్రూపు రాజకీయాలు, విభేదాలు సహజమేనని ధర్మపురి అరవింద్ అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ పార్టీలో కుటుంబ గొడవలు, కాంగ్రెస్ పార్టీలో మంత్రుల కొట్లాటలను చూస్తూనే ఉన్నామని ఆయన అన్నారు. తమ పార్టీలో విభేదాలు లేవని, భిన్నాభిప్రాయాలు మాత్రమే ఉంటాయని, అనంతరం అధిష్ఠానం నిర్ణయం ప్రకారం నడుచుకుంటామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కోసం ఇన్‌ఛార్జ్‌లను ఎప్పుడో రంగంలోకి దింపామని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఒకటి రెండు రోజుల్లో అభ్యర్థులను కూడా ప్రకటిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్‌లలో తమకు కాంగ్రెస్ పార్టీతోనే పోటీ ఉంటుందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభావం ఉంటుందని తాము అనుకోవడం లేదని, గెలుపు కోసం అందరం కలిసి పనిచేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## మెస్సీ వస్తే సింగరేణికి ఏం సంబంధం

**రూ.10 కోట్లు ఎలా ఖర్చు చేశారు**

**రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి ఆగ్రహం**

హైదరాబాద్, జనవరి 27 (ఈవార్తలు): సింగరేణిని కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. గత ఏడాది అర్జెంటీనా ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీ వస్తే సింగరేణి నుంచి రూ.10 కోట్లు ఖర్చు చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి నిధులను గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ దోచుకుంటోందని విమర్శించారు. "ఎవడో ఫుట్‌బాల్ ఆడుతాడట. వాడెవడో మెస్సీ ఇతర దేశాల నుంచి వస్తే నా సింగరేణికి ఏం సంబంధం అతను వస్తే సింగరేణి నుంచి రూ.10 కోట్లు ఖర్చు పెట్టారు. సింగరేణిలో కార్మికులకు, కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు ఇవ్వడానికి, పెంచడానికి డబ్బులు లేవు. మెడికల్ రీయింబర్సుమెంట్స్ కోసం డబ్బులు లేవు. కానీ ఎవడో మెస్సీ వస్తే వానికి డబ్బులు ఇస్తాడు. అతనిని ఆడించడం కోసం నా సింగరేణి కార్మికులు కష్టపడి సంపాదించిన డబ్బును అక్కడ ఖర్చు పెట్టాడనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎవరు అధికారం ఇచ్చారు" అని ఆయన ప్రశ్నించారు.

## మంత్రులను కలిస్తే తప్పేంటి

**మంత్రులతో భేటీపై భట్టి స్పందన**




హైదరాబాద్, జనవరి 27 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో ఉండగా, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ సోమవారం రాత్రి సమావేశం కావడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ భేటీపై మల్లు భట్టి విక్రమార్క స్పందించారు. ఉప ముఖ్యమంత్రితో మంత్రులు సమావేశం కాకూడదా అని ఆయన ప్రశ్నించారు. మంత్రులు తనతో భేటీ కావడం సాధారణ విషయమేనని ఆయన స్పష్టం చేశారు. ఇది పాలనాపరమైన అంశాలపై జరిగిన సమావేశమని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి అందుబాటులో లేనందున మంత్రులు ఉప ముఖ్యమంత్రిగా తనతో చర్చించేందుకు వచ్చారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు అందరూ కలిసి ఒక ఉమ్మడి కుటుంబంలా పనిచేస్తున్నామని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో ఈ భేటీ జరగడం చర్చకు దారి తీసిందని మీడియా ప్రతినిధి ప్రశ్నించగా, మల్లు భట్టి విక్రమార్క స్పందిస్తూ, కొందరు పిచ్చివాళ్లు ఏవేవో మాట్లాడుతుంటారని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు.

## టీచర్ ట్రైనింగ్ స్కిల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, జనవరి 27 (ఈవార్తలు): నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల మాంటెస్సోరి, ప్రీ-ప్రైమరీ, నర్సరీ టీచర్, కంప్యూటర్ టీచర్ ట్రైనింగ్ స్కిల్ కోర్సులలో ఆన్ లైన్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు నేషనల్ స్కిల్ అకాడమీ డైరెక్టర్ వెంకట రెడ్డి తెలిపారు. శిక్షణ కోసం ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కోర్సులకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నగరాలు, పట్టణాలు, జిల్లాలు, మండలాలు, గ్రామాల్లోని ఇంటర్ పాస్, డిగ్రీ, పీజీ విద్యార్థినిలు, మహిళలు ఎవరైనా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారులు ఉపాధి అవకాశాలు గల స్కిల్ డెవలప్మెంట్ ప్రీ-ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ కోర్సు, మాంటెస్సోరి టీచర్ ట్రైనింగ్ కోర్సు, నర్సరీ టీచర్ ట్రైనింగ్ మరియు కంప్యూటర్ టీచర్ ట్రైనింగ్ కోర్సులలో ఏదైనా కోర్సు ఎంపిక చేసుకోవచ్చు. కోర్సులు ఈ-లెర్నింగ్ ద్వారా ఆన్?లైన్?లో శిక్షణ అందించబడుతుంది, తర్వాత పరీక్షలను నిర్వహిస్తారు. పాస్ అయిన విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ ఆమోదిత సంస్థచే సర్టిఫికేట్?ను అందజేస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్తులకు మాంటెస్సోరి, ప్రీ-ప్రైమరీ, నర్సరీ టీచర్ ట్రైనింగ్ కోర్సులు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్రైవేట్ ప్రీ-స్కూల్స్, ప్లే స్కూల్స్, ఇంటర్నేషనల్ ప్రీ-స్కూల్స్ లలో మాంటెస్సోరి , ప్రీ-ప్రైమరీ నర్సరీ టీచర్లు గా ఉపాధి అవకాశాలు కలవు. కంప్యూటర్ టీచర్ ట్రైనింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్తులకు ప్రైవేట్ స్కూల్స్ లలో కంప్యూటర్ టీచర్లు గా ఉపాధి అవకాశాలు కలవు. భారతదేశంలో ప్రీ-స్కూల్ ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతోంది, ఎందుకంటే ప్రీ-స్కూల్ విద్యలో పెరుగుతున్న పెట్టుబడి మరియు ఆవిష్కరణల కారణంగా, 2030 నాటికి 2 మిలియన్ల ప్రీ-స్కూల్ ఉద్యోగాలు అంచనా వేయబడ్డాయి. నాణ్యమైన విద్య, సాంకేతిక ఏకీకరణ మరియు ఫ్రాంచైజ్ నమూనాలు ఈ వృద్ధికి కీలకమైనవి, ముఖ్యంగా ప్రధాన నగరాలు, జిల్లాలు మరియు ప్రధాన పట్టణాలలో కూడా మహిళలకు గణనీయమైన ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి. వివరాలకు ఫోన్: 9505800050 చేయవచ్చు.

## పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేద్దాం

**పడగొట్టినవి నిలబెడదాం.. ఏపీ సీఎం చంద్రబాబు**



అమరావతి, జనవరి 27 (ఈవార్తలు: పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి, గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన నిర్మాణాలను పునరుద్ధరించాలని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను ప్రపంచంలోనే అతిపెద్ద ఉద్యాన క్లస్టర్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో 10 జిల్లాలను ఉద్యాన కేంద్రాలుగా మార్చే సమీకృత అభివృద్ధి ప్రణాళికలపై మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, అనేక ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టిందని ఈ సమావేశంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, 10 జిల్లాల పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. తక్కువ నిధులతో త్వరగా పూర్తయ్యే వాటికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ ఏడాదిలోనే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణకు వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గాలేరు-నగరి ద్వారా కృష్ణా జలాలను కడప వరకు తీసుకెళ్లే అంశంపై దృష్టి సారించాలన్నారు. మొత్తంగా 20కి పైగా ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా కొత్తగా 8.87 లక్షల ఎకరాల ఆయకట్టుకు, మరో 4.30 లక్షల ఎకరాల స్థిరీకరణకు నీరందించవచ్చని అధికారులు సీఎంకు వివరించారు. ఇదే సమయంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ ప్రాజెక్టులు చేపట్టాలని, పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తయితే గోదావరి జలాలను ఉత్తరాంధ్ర వరకు తీసుకెళ్లి, పోలవరం-వంశధార నదుల అనుసంధానం చేపట్టవచ్చని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో ఉద్యాన పంటల సాగు గణనీయంగా పెరుగుతుందని మంత్రి అచ్చెన్నాయుడు అభిప్రాయపడ్డారు. గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా 500లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులను పండించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని 10 జిల్లాల్లో 201 క్లస్టర్లు, 303 మండలాల్లో ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. మూడేళ్లలో ఉద్యాన సాగు విస్తీర్ణాన్ని 8.41 లక్షల హెక్టార్ల నుంచి 14.41 లక్షల హెక్టార్లకు పెంచేలా ప్రణాళికలు రూపొందించారు. దుబాయ్‌కి చెందిన డీపీ వరల్డ్ సంస్థ ఏపీలో ఉద్యాన క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చిందని సీఎం వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాలని, ఇందుకు అవసరమైన గ్రామీణ రహదారుల నెట్‌వర్క్, లాజిస్టిక్స్, మార్కెట్, గ్లోబల్ కనెక్టివిటీపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ బృహత్తర ప్రణాళికల అమలుకు పూర్వోదయ, సాస్కి, రాష్ట్ర ప్రభుత్వ నిధులను సమన్వయం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, పోర్ట్ కనెక్టివిటీ, గోదాములు, కోల్డ్ చైన్ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అకీరా నందన్‌కు ఢిల్లీ హైకోర్టులో ఊరట

**డీప్‌ఫేక్ సినిమా వీడియో తొలగింపునకు ఆదేశాలు**



ఢిల్లీ: ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కుమారుడు అకీరా నందన్‌కు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. తన అనుమతి లేకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీతో రూపొందించిన డీప్‌ఫేక్ సినిమాపై అకీరా దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం స్టే విధించింది. ఈ సినిమాను వెంటనే అన్ని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి తొలగించాలని కీలక ఆదేశాలు జారీ చేసింది. తన పేరు, ఫొటోలు, స్వరం, వ్యక్తిత్వాన్ని వాడుకుని 'ఏఐ లవ్ స్టోరీ' పేరుతో ఓ పూర్తిస్థాయి సినిమాను రూపొందించారని, దానిని యూట్యూబ్ వంటి సోషల్ మీడియాలో విడుదల చేశారని అకీరా తన పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ డీప్‌ఫేక్ సినిమా వల్ల తన ప్రతిష్ఠకు భంగం కలుగుతోందని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉందని అతడు కోర్టు దృష్టికి తీసుకెళ్లాడు. ఇది తన వ్యక్తిత్వ, గోప్యతా హక్కులను ఉల్లంఘించడమేనని వాదించాడు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ తుషార్ రావు... అకీరా నందన్‌కు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అతడి అనుమతి లేకుండా ఎలాంటి డీప్‌ఫేక్ కంటెంట్‌ను సృష్టించడం, పంచుకోవడం చేయరాదని సంభవామి స్టూడియోస్‌తో పాటు ఇతరులను ఆదేశించారు. వివాదాస్పద సినిమా లింకులను, నకిలీ ఖాతాలను తక్షణమే తొలగించాలని యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ సంస్థలకు స్పష్టం చేశారు. ఈ కంటెంట్‌ను అప్‌లోడ్ చేసిన వారి ఐపీ అడ్రస్‌లు, ఇతర వివరాలను కోర్టుకు సమర్పించాలని కూడా ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇటీవల కాలంలో సినీ ప్రముఖులు, ఇతర రంగాల సెలెబ్రిటీలో వ్యక్తిగత గోప్యతా హక్కుల పరిరక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయిస్తుండడం తెలిసిందే.

## ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలి



**విద్యార్థి జన సమితి ఓయూ అధ్యక్షుడు కడారి రమేష్ యాదవ్**

హైదరాబాద్, జనవరి 27 (ఈవార్తలు): ఫీజు రీయింబర్స్?మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో విద్యార్థి జన సమితి ఓయూ అధ్యక్షుడు కడారి రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో.. భారీ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేయవలసినటువంటి దాదాపు పదివేల కోట్ల రూపాయల ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పేరుకుపోయిన ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఫీజు బకాయిల నిర్లక్ష్యం వలన సాధారణ గ్రామీణ పేద విద్యార్థులను ప్రైవేటు విద్యాసంస్థలు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరాల ప్రశాంత్ గారు, రాష్ట్ర నాయకులు డప్పు గోపి, రాష్ట్ర కార్యదర్శి జిల్లాపేల్లి దిలీప్ కుమార్,పవన్ కుమార్, యూనివర్సిటీ విద్యార్థులు పరిశోధక విద్యార్థి రామకృష్ణ, పీజీ విద్యార్థులు ఆవుల శ్రీధర్ యాదవ్, గోపి, అఖిల్, విక్రమ్,సందీప్,రుద్రాక్ష,వెంకటేశ్, నరేష్ గౌడ్, మనోజ్ తదితర విద్యార్థి నాయకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పనితీరు బాగోకపోతే పదవులు ఊడతాయి

**నేతలకు చంద్రబాబు వార్నింగ్**



అమరావతి, జనవరి 27 (ఈవార్తలు): పార్టీ కంటే ఏదీ ముఖ్యం కాదని, ఏ నాయకుడైనా సరే నిర్లక్ష్యం వహించినా, వివాదాలు సృష్టించినా పక్కనబెట్టడానికి వెనుకాడబోనని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. అధికారం వచ్చిందన్న భావనతో ఎవరూ అలసత్వం ప్రదర్శించవద్దని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలని స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్లమెంట్ కమిటీల వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నేతలకు దిశానిర్దేశం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. "పార్టీలో పదవులు పొందిన వారి పనితీరును ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తాను. సరిగా పనిచేయకపోతే వారిని తప్పించి, మరొకరికి అవకాశం కల్పిస్తాను. పార్టీలో తీసుకొస్తున్న మార్పులకు అనుగుణంగా నేతలు, కార్యకర్తల్లో కూడా మార్పు రావాలి. వచ్చిన అధికారాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని చంద్రబాబు స్పష్టం చేశారు. పొలిటికల్ గవర్నెన్స్‌లో పార్లమెంట్ కమిటీలు కీలకమని, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు కూడా పార్లమెంట్ అధ్యక్షులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలతో కలిసికట్టుగా పనిచేయాలని, 2024 ఎన్నికల్లో కూటమికి వచ్చిన ఓట్ల కంటే మరో పది ఓట్లు అదనంగా వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి మాట నిలబెట్టుకున్నామని తెలిపారు. "ప్రజల భూముల పట్టాదారు పాసుపుస్తకాలపై, పొలం సరిహద్దు రాళ్లపై కూడా వాళ్ల ఫొటోలు ముద్రించుకున్నారు. చరిత్రలో ఎప్పుడైనా ఇలా జరిగిందా ప్రజల ఆస్తుల జుట్టు వాళ్ల చేతుల్లో పెట్టుకుని ఆడించాలని చూశారు. అందుకే ఆ లోపభూయిష్టమైన చట్టాన్ని రద్దు చేశాం. ఏడాదిలోగా మళ్లీ సర్వేలు చేసి, ఎలాంటి సమస్యలు లేని పట్టాదారు పుస్తకాలు అందిస్తాం" అని హామీ ఇచ్చారు. అమరావతి విషయంలో గత ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడిందని, ఇప్పుడు మళ్లీ తాము రాజధానికి జీవం పోశామని అన్నారు. అమరావతే ఏకైక రాజధాని అని స్పష్టం చేస్తూనే, అన్ని ప్రాంతాల అభివృద్ధి తమ ధ్యేయమని, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని పునరుద్ఘాటించారు. భోగాపురం విమానాశ్రయంలో 500 ఎకరాలు కొట్టేయాలని చూశారని, పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారని ఆరోపించారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని ఎద్దేవా చేశారు. పార్టీలో కార్యకర్తే అధినేత అని, వారికి న్యాయం జరిగినప్పుడే పార్టీ శాశ్వతంగా ఉంటుందని చంద్రబాబు అన్నారు. గత ఐదేళ్లలో కార్యకర్తలు ఎన్నో కష్టాలు పడ్డారని, పసుపు జెండా కోసం రక్తం చిందించారని గుర్తుచేశారు. "ఏ పని జరిగినా కార్యకర్తలకు గుర్తింపు ఉండాలి. నాయకులెవరూ కేడర్‌ను విస్మరించవద్దు. వారితో నిరంతరం అనుసంధానమై ఉండాలి" అని ఎమ్మెల్యేలు, ఎంపీలకు సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. "మనం చేసే పనులు ఎంత ముఖ్యమో, మనపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టడం కూడా అంతే ముఖ్యం. సోషల్ మీడియాలోనే కాదు, మౌత్ టు మౌత్ పబ్లిసిటీతో ప్రజలకు వాస్తవాలు వివరించాలి," అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సూపర్ 6 హామీలను సూపర్ హిట్ చేశామని, డీఎస్సీ, పోలీస్ ఉద్యోగాల భర్తీతో పాటు రోడ్ల మరమ్మతులు వేగవంతం చేశామని వివరించారు. రాబోయే అన్ని ఎన్నికల్లోనూ కూటమి గెలిచేలా ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలని కోరారు.

## సొంతూరిలో పేర్ని నానిపై కేసు

**బాబు, పవన్‌పై అనుచిత వ్యాఖ్యల ఫలితం**

మచిలీపట్నం, జనవరి 27 (ఈవార్తలు): వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నానిపై ఆయన సొంతూరిలోనే పోలీసులు కేసు నమోదు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను లక్ష్యంగా చేసుకుని ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. తెలుగుదేశం పార్టీ నేతల ఫిర్యాదు మేరకు మచిలీపట్నంలోని ఇనగుదురుపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇటీవల జరిగిన వైఎస్సార్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పేర్ని నాని... సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తీవ్రమైన, అసభ్యకర వ్యాఖ్యలు చేశారని టీడీపీ నేతలు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదం వంటి సున్నితమైన అంశాలను ప్రస్తావిస్తూ మతపరమైన మనోభావాలను దెబ్బతీసేలా, ఇరు వర్గాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వివాదం పెద్దదైంది. టీడీపీ నేతల ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు.. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్లు 196(1), 353(2), 351(2), 352 కింద పేర్ని నానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ఏపీకి రాహుల్ గాంధీ!


**షర్మిల ఆహ్వానానికి గ్రీన్ సిగ్నల్**

విజయవాడ, జనవరి 27 (ఈవార్తలు): ఏపీ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టనున్న ఉద్యమంలో పాల్గొనాలని ఆమె చేసిన ఆహ్వానానికి రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించారు. ఏపీ పర్యటనకు వస్తానని, పార్టీ పోరాటంలో భాగస్వామ్యం అవుతానని ఆయన హామీ ఇచ్చినట్టు షర్మిల తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని 10 జనపథ్‌లో ఉన్న రాహుల్ గాంధీ నివాసంలో ఈ సమావేశం జరిగింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ ఉద్యమంలో పాల్గొనాల్సిందిగా షర్మిల రాహుల్‌ను కోరారు. ఇందుకు రాహుల్ అంగీకరించారని, త్వరలోనే ఏపీకి వస్తానని మాట ఇచ్చారని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 2వ తేదీతో ఉపాధి హామీ పథకం ప్రారంభమై 20 ఏళ్లు పూర్తికానుంది. ఈ నేపథ్యంలో, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామం నుంచే ఈ ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్టు షర్మిల వివరించారు.

## కార్యకర్తే పార్టీకి అధినేత

**టీడీపీ వర్క్‌షాప్‌లో చంద్రబాబు**

**నాయకులతో కలిసి కూర్చుని శిక్షణ**



మంగళగిరి, జనవరి 27 (ఈవార్తలు): నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినా, తెలుగుదేశం పార్టీలో మాత్రం తాను ఒక సామాన్య కార్యకర్తనే అని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి చాటిచెప్పారు. అధికారిక హోదాలు, ప్రోటోకాల్ పక్కనపెట్టి, పార్టీ ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరంలో ఆయన కార్యకర్తల మధ్యలో కూర్చుని నాయకులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన పార్లమెంట్ కమిటీల వర్క్‌షాప్‌లో ఆయన నిరాడంబరత అందరినీ ఆశ్చర్యపరిచింది, స్ఫూర్తినింపింది. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో 25 పార్లమెంట్ కమిటీల కోసం తెలుగుదేశం పార్టీ ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఒక్కో కమిటీ నుంచి 42 మంది చొప్పున మొత్తం 1,050 మంది సభ్యులు ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ వర్క్‌షాప్‌లో సీఎం చంద్రబాబుతో పాటు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్ జరుగుతున్న వివిధ గదుల్లోకి స్వయంగా వెళ్లిన చంద్రబాబు, అక్కడి నాయకులు, కార్యకర్తల మధ్యలో కూర్చుని వారితో మమేకం అయ్యారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు నూతన పార్లమెంట్ అధ్యక్షులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతిలోనూ ఆయన సాధారణ సభ్యుడిలా హాజరై, నేతలు చెప్పే విషయాలను శ్రద్ధగా విన్నారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి తమతో పాటు కూర్చోవడంతో అక్కడున్న నాయకులు, కార్యకర్తలు మొదట ఆశ్చర్యానికి గురయ్యారు. ఆయన చూపిన చొరవ, నిబద్ధత తమలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని వారు అభిప్రాయపడ్డారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి 'కార్యకర్తే అధినేత' అనే సిద్ధాంతాన్ని నమ్ముతామని, దానికి అనుగుణంగానే తాను ఈ కార్యక్రమంలో పాల్గొన్నానని చంద్రబాబు పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, నాలుగున్నర దశాబ్దాల ప్రయాణం, క్యాడర్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై ఆయన నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ వర్క్‌షాప్‌లో కూటమి ప్రభుత్వ విజయాలు, భవిష్యత్ ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలు, విజన్ ప్లాన్‌లపై కూడా సభ్యులకు అవగాహన కల్పించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఉదయం నుంచి పార్టీ కార్యాలయంలోనే ఉన్న నారా లోకేశ్ కూడా ప్రతి బృందం సభ్యులతోనూ ముచ్చటించారు. చంద్రబాబు తన హోదాను పక్కనపెట్టి సామాన్య కార్యకర్తగా ఒదిగిపోయిన విధానం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. ఈ ఘటన పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది.

## జోగి రమేశ్‌తో కేతిరెడ్డి భేటీ



**కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**

అమరావతి, జనవరి 27 (ఈవార్తలు):మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రామును తప్పుడు కేసులతో అరెస్ట్ చేశారని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈరోజు ఆయన జోగి రమేశ్ ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తప్పులను ఎత్తిచూపుతున్నందుకు 83 రోజులు జైల్లో పెట్టారని, చంద్రబాబు సర్కార్ వచ్చిన తర్వాత తప్పుడు కేసులు పెట్టి అందరినీ ఇబ్బంది పెడుతోందని మండిపడ్డారు. "జోగి రమేశ్ ను కలిసేందుకు ఆసుపత్రికి వెళ్లిన కుటుంబ సభ్యులపైనా కేసు పెట్టారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఎలా ఉందో అంతా చూస్తున్నారు. మర్డర్లు చేసిన వారిపై కేసు పెట్టడం లేదు. కోడిని, గొర్రెలను కోసిన వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారు. అక్రమంగా జైళ్లకు పంపిస్తే రెట్టించిన ఉత్సాహంతో మావాళ్లు పనిచేస్తారు. కూటమి ప్రభుత్వం తప్పిదాలపై జోగి రమేశ్ పోరాటం చేస్తూనే ఉంటారు" అని కేతిరెడ్డి అన్నారు. "ధర్మవరంలో 70 శాతం కల్తీ మద్యం దొరుకుతోంది. కల్తీ మద్యం తయారు చేసేది నీ జిల్లా నుంచే చంద్రబాబు. బెల్టుషాపులు లేకుండా చేస్తానన్నావ్. కానీ ఇప్పుడు ఊరికి నాలుగు బెల్టు షాపులు ఉన్నాయి. వేలంపాటలో బెల్ట్ షాపులు పాడుకుంటున్నారు. గిట్టుబాటు కావడం కోసం కల్తీ మద్యం అమ్ముతున్నారు. కొన్ని రోజుల క్రితం కడప జిల్లాలో ఇద్దరు చనిపోయారు. మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్స్ కింద తనపై ఉన్న కేసును కొట్టేయించుకోవాలని చంద్రబాబు చూస్తున్నాడు. చంద్రబాబుపై ఉన్న కేసులను మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్స్ అని ఎలా తొలగిస్తున్నారు" అని ప్రశ్నించారు. "చట్టం అందరికీ ఒకటే. కేసులు తీసేయించుకోవాలని చూస్తున్న ప్రయత్నంపై అప్పీల్‌కు వెళతాం. మద్యం సీసాలపై క్యూఆర్ కోడ్ మేం అధికారంలో ఉన్నప్పుడే తెచ్చాం. మంచి మద్యం ఇస్తానని చంద్రబాబు చెబితే అందరూ ఈలలు వేశారు. మంచి విద్య, వైద్యం ఇస్తామని జగన్ చెప్పితే ఎవరూ చప్పట్లు కొట్టలేదు. నేను ఇది చేశానని చెప్పి గడప గడపకు వెళ్లాలంటే ధైర్యం కావాలి. జగన్ ఎమ్మెల్యేలందరినీ ప్రజల ఇళ్ల వద్దకు పంపించారు. నాపై ఆరోపణలకు ఎందుకు ఆధారాలు చూపలేకపోతున్నారు. చేతనైతే వాటిపై చర్యలు తీసుకోండి" అని సవాల్ విసిరారు. "తిరుపతి లడ్డూలో పందికొవ్వు కలిపారని సీఎం, డిప్యూటీ సీఎం ప్రచారం చేశారు. ఈ రోజు లడ్డూలో అలాంటిదేమీ లేదని తేలింది. తాము ఒకటి చేయాలనుకుంటే మరొకటి జరిగిందని కూటమి నేతలు బాధపడుతున్నారు. ఇలాంటి దుష్ప్రచారాలు చేసేవాడు హిందూమతాన్ని కాపాడతాడా నకిలీ మద్యం విషయంలో తప్పుడు ఆధారాలతో బురదజల్లారు. దీనిపై లీగల్‌గా ఫైట్ చేస్తాం. మమ్మల్ని ఇబ్బంది పెట్టినవారిని ఎవరినీ వదలం" అని హెచ్చరించారు.




# బంగారం, వెండి ఆల్ టైమ్ రికార్డ్

ముంబై: దేశీయ బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు మంగళవారం సరికొత్త చరిత్ర సృష్టించాయి. మునుపెన్నడూ లేని విధంగా జీవితకాల గరిష్ఠ స్థాయికి చేరి, మదుపరులను, వినియోగదారులను ఆశ్చర్యపరిచాయి. మంగళవారం ట్రేడింగ్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ.1.66 లక్షలకు చేరగా, కిలో వెండి ధర ఏకంగా రూ.3.7 లక్షలు పలికింది. వివరాల్లోకి వెళితే, సోమవారం ముగింపు ధర రూ.1,58,700తో పోలిస్తే, 10 గ్రాముల బంగారంపై ఒక్కరోజే రూ.7,300 (4.6 శాతం) పెరిగింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఫిబ్రవరి ఫ్యూచర్స్ ట్రేడింగ్ సమయంలో రూ.1,59,820 వద్ద ఆల్ టైమ్ రికార్డును నమోదు చేసింది. బంగారం బాటలోనే వెండి కూడా పరుగులు పెట్టింది. ఎంసీఎక్స్‌లో మార్చి ఫ్యూచర్స్ కిలోకు రూ.3,64,000 మార్కును దాటగా, రిటైల్ మార్కెట్లో ధరలు మరింత ఎక్కువగా ఉన్నాయి. ముంబై, ఢిల్లీలలో కిలో వెండి ధర రూ.3.7 లక్షలు ఉండగా, హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో ఇది రూ.3,87,000 వరకు పలికింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి వల్లే ఈ ధరల పెరుగుదల చోటుచేసుకుందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పెట్టుబడిదారులు బంగారం, వెండిని 'సేఫ్-హెవెన్' ఆస్తులుగా భావించి భారీగా కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 5,100 డాలర్ల రికార్డు స్థాయిని దాటడం కూడా దేశీయ ధరలపై ప్రభావం చూపింది. ఈ రికార్డు ధరలతో మార్కెట్లో తీవ్రమైన కదలికలు కనిపిస్తుండగా, మదుపరులు తదుపరి పరిణామాలను జాగ్రత్తగా గమనిస్తున్నారు.

## పాక్‌లో రాముడి కుమారుడి ఆలయ పునరుద్ధరణ

**లోహ్ అలయాన్ని పునరుద్ధరించినట్లు తెలిపిన డబ్ల్యుసీఎల్ఏ**

లాహోర్: పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో గల చారిత్రక లాహోర్ కోటలో ఉన్న శ్రీరాముడి కుమారులలో ఒకరైన లవుడి ఆలయాన్ని (లోహ్ ఆలయం) పునరుద్ధరించి ప్రజల సందర్శనార్థం అందుబాటులోకి తెచ్చినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. లవ ఆలయాన్ని పూర్తిగా పునరుద్ధరించినట్లు వారు తెలిపారు. దీనితో పాటు సిక్కు కాలం నాటి పలు స్మారక చిహ్నాలను కూడా తెరిచినట్లు వాల్డ్ సిటీ లాహోర్ అథారిటీ (డబ్ల్యుసీఎల్ఏ) పేర్కొంది. లవ ఆలయంతో పాటు పునరుద్ధరించిన వాటిలో సిక్కుల కాలం నాటి హమామ్, మహారాణా రంజిత్ సింగ్ అథ్ దారా పెవిలియన్ ఉన్నాయి. లవుడి పేరు మీదుగానే లాహోర్ పేరు వచ్చిందని హిందువులు విశ్వసిస్తారు. లవ ఆలయాన్ని 2018లో పాక్షికంగా పునరుద్ధరించారు. లాహోర్ కోట సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పడంలో భాగంగా అందులోని హిందూ, సిక్కు మందిరాలు, స్మారక చిహ్నాలు, మొఘలా కాలం నాటి నిర్మాణాలను పునరుద్ధరిస్తున్నట్లు వాల్డ్ సిటీ లాహోర్ అథారిటీ ప్రతినిధులు తెలిపారు. ఇందులో సిక్కుల కాలం నాటి 100 స్మారక చిహ్నాలు ఉండగా, ప్రస్తుతం 30 వరకు కనుమరుగైనట్లు అమెరికాకు చెందిన ఒక సిక్కు పరిశోధకుడు ఇటీవల తెలియజేశారు.



## ఫ్రాన్స్ లో తొలి హిందూ దేవాలయానికి శంకుస్థాపన

పారిస్: భారత్ - ఫ్రాన్స్ మధ్య సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంబంధాలు మరింత బలోపేతమయ్యేలా మరో అడుగు పడింది. పారిస్ సమీపంలోని బుస్సీ-సెయింట్-జార్జెస్‌లో నిర్మాణమవుతున్న మొదటి హిందూ దేవాలయానికి శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన తొలి రాళ్లు వచ్చాయి. ఈ రాళ్లకు అక్కడున్న ఇండియన్ కమ్యూనిటీ ఘన స్వాగతం పలికింది. శతాబ్దాల నాటి హస్తకళా వారసత్వాన్ని, నైపుణ్యాన్ని ఉపయోగించి ఆలయాన్ని నిర్మించనున్నారు. ఆలయ నిర్మాణం కోసం భారతీయ కళాకారులు స్థానిక ఫ్రెంచ్ రాతి పనివారితో కలిసి పనిచేస్తారు. వీరిలో నోట్రే-డామ్ కేథడ్రల్ పునరుద్ధరణలో పాల్గొన్న నిపుణుల బృందం కూడా ఉంది. భారతీయ వాస్తుశిల్ప సంప్రదాయాలను ఫ్రెంచ్ ఇంజినీరింగ్ నైపుణ్యంతో ఏకం చేసి ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ, "భారతదేశం నుంచి మొదటి రాళ్ల రాక ఒక చారిత్రాత్మక మైలురాయి. ప్రతి రాయి వారసత్వం, శ్రద్ధ, ఉద్దేశాన్ని కలిగి ఉంటుంది. ఇది భాగస్వామ్య గౌరవం, సహకారం ద్వారా భారతీయ సంప్రదాయం, ఫ్రెంచ్ ఇంజినీరింగ్ యొక్క ఐక్యతను సూచిస్తుంది" అని తెలిపారు.

# ఘనంగా హల్వా వేడుక

**బడ్జెట్ అధికారుల 'లాక్-ఇన్' పీరియడ్.. ఫిబ్రవరి 1న పార్లమెంటులో బడ్జెట్**

**మొబైల్ యాప్‌లోనూ అందుబాటులో బడ్జెట్ పత్రాలు**

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ 2026-27 రూపకల్పన ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. ఏటా బడ్జెట్ తయారీలో చివరి ఘట్టానికి సూచనగా నిర్వహించే సంప్రదాయ 'హల్వా వేడుక' మంగళవారం నాడు ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో ఉన్న బడ్జెట్ ప్రెస్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి హాజరయ్యారు. బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ ముగింపు దశకు వచ్చిందని, ఇక ప్రింటింగ్ ప్రారంభమవుతుందని ఈ వేడుక సంకేతాన్నిస్తుంది. ఈ వేడుక ముగిసిన వెంటనే బడ్జెట్ రూపకల్పనలో పాలుపంచుకున్న కీలక అధికారులు 'లాక్-ఇన్' పీరియడ్‌లోకి వెళతారు. ఫిబ్రవరి 1న పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెట్టే వరకు వీరంతా బయటి ప్రపంచంతో ఎలాంటి సంబంధాలు లేకుండా పూర్తి ఏకాంతంగా గడుపుతారు. ఫోన్, ఇంటర్నెట్ వంటి సదుపాయాలకు కూడా దూరంగా ఉంటారు. బడ్జెట్‌కు సంబంధించిన అత్యంత కీలకమైన, రహస్య సమాచారం బయటకు పొక్కకుండా ఉండేందుకు దశాబ్దాలుగా ఈ కఠిన నిబంధనను పాటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి పంకజ్ చౌదరి అధికారులకు హల్వాను వడ్డించి, శుభాకాంక్షలు తెలిపారు. హల్వా వేడుక అనంతరం నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రెస్‌ను సందర్శించారు. అక్కడ బడ్జెట్ పత్రాల ముద్రణకు సంబంధించిన తుది ఏర్పాట్లను సమీక్షించారు. బడ్జెట్ రూపకల్పన, ముద్రణ పనుల్లో నిమగ్నమైన సిబ్బందికి, అధికారుల బృందానికి ఆమె ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని వివిధ విభాగాల కార్యదర్శులు, బడ్జెట్ తయారీ ప్రక్రియతో సంబంధం ఉన్న ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. గత కొన్నేళ్లుగా అనుసరిస్తున్న విధానాన్ని కొనసాగిస్తూ, ఈసారి కూడా బడ్జెట్ పత్రాలన్నీ ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేందుకు డిజిటల్ రూపంలో విడుదల చేయనున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వార్షిక ఆర్థిక నివేదిక (బడ్జెట్), పద్దుల కేటాయింపులు (డిమాండ్ ఫర్ గ్రాంట్స్), ఆర్థిక బిల్లు వంటి కీలక పత్రాలన్నీ 'యూనియన్ బడ్జెట్ మొబైల్ యాప్' ద్వారా లభిస్తాయి. పార్లమెంటు సభ్యులు, సాధారణ ప్రజలు ఈ యాప్ ద్వారా బడ్జెట్ వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. ఈ యాప్ ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్‌లపై అందుబాటులో ఉంది. అయితే, ఫిబ్రవరి 1న పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాతే ఈ పత్రాలు యాప్‌లో, వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.



## శశిథరూర్ మళ్లీ డుమ్మా!

**కాంగ్రెస్ కీలక సమావేశానికి గైర్హాజరు**

**పార్టీ మారనున్నట్లు ఊహాగానాలు**



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ మరోసారి పార్టీ కీలక సమావేశానికి హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల వ్యూహంపై చర్చించేందుకు మంగళవారం సోనియా గాంధీ నివాసంలో జరిగిన ముఖ్యమైన భేటీకి ఆయన గైర్హాజరయ్యారు. ప్రస్తుతం ఆయన దుబాయ్‌లో జరుగుతున్న ఓ సాహిత్య ఉత్సవంలో పాల్గొంటున్నారు. కేంద్ర బడ్జెట్‌పై అనుసరించాల్సిన వైఖరి, జీ-రామ్-జీ ఉపాధి హామీ పథకంపై ప్రభుత్వాన్ని నిలదీసే అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. అయితే, థరూర్ దుబాయ్ పర్యటనలో ఉండటంతో ఈ భేటీకి రాలేకపోయారని, ఆయన రాత్రికి తిరిగి వస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల కాలంలో థరూర్ పార్టీ సమావేశాలకు దూరంగా ఉండటం గమనార్హం. గత వారం కేరళలో రాహుల్ గాంధీ పర్యటన సందర్భంగా తనకు సరైన గౌరవం దక్కలేదని ఆయన అసంతృప్తితో ఉన్నారని ప్రచారం జరిగింది. అంతకుముందు నవంబర్, డిసెంబర్ నెలల్లో కూడా మూడు కీలక సమావేశాలకు ఆయన హాజరు కాలేదు. వరుస పరిణామాలతో ఆయన కాంగ్రెస్‌ను వీడతారనే ఊహాగానాలు మళ్లీ మొదలయ్యాయి. అయితే, ఈ ఊహాగానాలను కాంగ్రెస్ వర్గాలు కొట్టిపారేస్తున్నాయి. థరూర్ పార్టీ సీనియర్ నేత అని, ఆయనకు ఏమైనా సమస్యలుంటే అధిష్ఠానం చర్చిస్తుందని స్పష్టం చేశాయి. మరోవైపు, తన పుస్తక ప్రచారం కోసమే దుబాయ్ వెళ్లినట్లు థరూర్ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. విదేశంలో ఉన్నప్పుడు రాజకీయ విషయాలపై మాట్లాడటం సరికాదని థరూర్ పేర్కొన్నట్లు సమాచారం. మొత్తం మీద, ఈ పరిణామంతో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

## మోస్ట్ వాంటెడ్ అళగురాజా ఎన్‌కౌంటర్

**ఆయుధాల రికవరీకి తీసుకెళ్లగా దాడికి యత్నం**

**అళగురాజాపై 30కి పైగా హత్య, దోపిడీ కేసులు**



చెన్నై: తమిళనాడులో మరోసారి పోలీస్ ఎన్‌కౌంటర్ కలకలం సృష్టించింది. పెరంబలూరు జిల్లాలో సోమవారం రాత్రి జరిగిన ఎదురుకాల్పుల్లో కరడుగట్టిన నేరగాడు అళగురాజా హతమయ్యాడు. పోలీసులపై దాడి చేసి తప్పించుకునేందుకు ప్రయత్నించగా ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో అళగురాజా తలకు బుల్లెట్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. వివరాల్లోకి వెళితే.. హత్య, హత్యాయత్నం, బెదిరించి డబ్బు వసూలు చేయడం, కాంట్రాక్ట్ హత్యలు వంటి 30కి పైగా క్రిమినల్ కేసుల్లో అళగురాజా నిందితుడిగా ఉన్నాడు. అత్యంత ప్రమాదకరమైన నేరస్థుడిగా పేరున్న ఇతను, చాలా సంవత్సరాలుగా పోలీసులకు చిక్కకుండా జిల్లాలను మారుస్తూ పరారీలో ఉన్నాడు. ఇటీవల మరో నేరగాడు కాళిముత్తుపై జరిగిన దాడి కేసులో అళగురాజా కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో, నిఘా వర్గాల సమాచారంతో మంగళమెట్ ఇన్‌స్పెక్టర్ నందకుమార్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం ఆదివారం రాత్రి ఊటీలో అళగురాజాను, మరో ఆరుగురు అనుచరులను అరెస్ట్ చేసింది. అనంతరం, నిందితుడు దాచిపెట్టిన ఆయుధాలు, పేలుడు పదార్థాలను రికవరీ చేసేందుకు పెరంబలూరు జిల్లా తిరుమంతురై సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ ఆయుధాలను వెలికితీస్తున్న సమయంలో అళగురాజా అకస్మాత్తుగా కొడవలితో పోలీసులపై దాడికి పాల్పడ్డాడు. లొంగిపోవాలని హెచ్చరించినా వినకుండా దాడిని కొనసాగించడంతో పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపారు. ఈ దాడిలో ఓ పోలీసు అధికారికి గాయాలవగా, అతడిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. అళగురాజా మరణంతో పలు జిల్లాల్లో విస్తరించిన ఓ పెద్ద క్రిమినల్ నెట్‌వర్క్‌ను ఛేదించామని, అతని అనుచరులపై విచారణ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

## చరిత్రలో అత్యంత కనిష్ఠస్థాయికి ఇరాన్ కరెన్సీ

టెహ్రాన్: తీవ్ర నిరసనలు, ఆంక్షలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఇరాన్ దేశ కరెన్సీ భారీగా పతనమవుతోంది. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న నిరసనలతో ఇరాన్‌లో 6 వేల మందికి పైగా మరణించారు. అయితే మృతుల సంఖ్య అంతకంటే ఎక్కువగానే ఉంటుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆర్థికపరమైన ఆంక్షలతో ఇరాన్‌కు ఊపిరాడటం లేదు. ఈ పరిణామాల నేపథ్యంలో డాలర్ మారకంతో ఇరాన్ కరెన్సీ రియాల్స్ చరిత్రలో అత్యంత అల్పస్థాయికి పడిపోయింది. ఒక డాలర్ విలువతో పోలిస్తే 15 లక్షల రియాల్స్‌కు క్షీణించింది. అంతర్గత సంక్షోభానికి తోడు అంతర్జాతీయ ఆంక్షల కారణంగా ఇరాన్ ఆర్థిక వ్యవస్థ దారుణంగా పతనమవుతోంది. 2015లో అమెరికా డాలర్‌తో ఇరాన్ కరెన్సీ విలువ 32 వేల రియాల్స్‌గా ఉండేది. ఆ తర్వాత రియాల్స్ పతనమవుతున్నప్పటికీ, ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక మరింత క్షీణించింది. రియాల్ విలువ పడిపోతుండటంతో ఇరాన్ ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. నిత్యావసరాల నుంచి అత్యవసర మందుల వరకు ధరలు పెరుగుతుండటంతో ప్రభుత్వం ఇరానియన్లకు నెలకు 7 డాలర్ల మేర ఆర్థిక సాయం అందిస్తోంది. కానీ ఇది కూడా ఇరానియన్ల జీవన పరిస్థితిని మార్చలేకపోతోంది.

## బంగ్లాదేశ్ జైలు నుంచి 23 మంది భారతీయుల విడుదల

ఢాకా: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖకు చెందిన 9 మందితో సహా 23 మంది భారతీయ మత్స్యకారులు బంగ్లాదేశ్ జైలు నుంచి విడుదలయ్యారు. వీరు గత కొంతకాలంగా బాగేర్‌హట్ జైలులో ఉంటున్నారు. జైలు అధికారులు ఈరోజు మధ్యాహ్నం 11 గంటలకు వారిని బంగ్లాదేశ్ కోస్ట్ గార్డుకు అప్పగించారు. ఈ సమయంలో భారత హైకమిషన్, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారులు, పోలీసులు, జిల్లా పరిపాలన ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ హాజరయ్యారు. కోస్ట్ గార్డు సిబ్బంది విడుదలైన మత్స్యకారులను భారీ భద్రతతో మోంగ్లా సీపోర్ట్ కు తీసుకువెళ్లారు. గురువారం వారిని బంగ్లాదేశ్-భారత్ సముద్ర సరిహద్దు మధ్యలో ఇండియన్ కోస్ట్ గార్డుకు అప్పగించే అవకాశం ఉంది. అక్టోబర్ 2025లో ఈ మత్స్యకారులు బంగ్లాదేశ్ జలాల్లోకి ప్రవేశించడంతో ఆ దేశ అధికారులు వారిని అరెస్టు చేశారు. రెండు దశల్లో ఈ మత్స్యకారులు అరెస్టయ్యారు. బంగ్లాదేశ్ నావికాదళం మొదటిసారి 14 మందిని, రెండోసారి 9 మంది మత్స్యకారులను అదుపులోకి తీసుకుంది. నాటి నుంచి వీరు బాగేర్‌హట్ జైల్లో ఉన్నారు.

## పుంజుకున్న స్టాక్ మార్కెట్లు

**ఈయూతో భారత్ చారిత్రాత్మక డీల్ ఎఫెక్ట్**

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నాడు లాభాలతో ముగిశాయి. రోజంతా తీవ్ర ఒడుదొడుకులకు లోనైనప్పటికీ, భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కీలక వాణిజ్య ఒప్పందం కుదరడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. దీంతో సూచీలు చివరికి సానుకూలంగా స్థిరపడ్డాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి నిఫ్టీ 126.75 పాయింట్లు లాభపడి 25,175.40 వద్ద నిలిచింది. సెన్సెక్స్ కూడా 319.78 పాయింట్లు పెరిగి 81,857.48 వద్ద ముగిసింది. భారత్, ఈయూ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం మార్కెట్లకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ డీల్ ప్రకారం, 2032 నాటికి భారత్‌కు ఈయూ నుంచి వస్తువుల ఎగుమతులు రెట్టింపు అవుతాయని అంచనా. భారత్‌కు వచ్చే దాదాపు 96.6 శాతం యూరోపియన్ వస్తువులపై సుంకాలను తగ్గించడం లేదా పూర్తిగా తొలగించడం జరుగుతుంది. అదే సమయంలో, భారత్ నుంచి దిగుమతి చేసుకునే 99.5 శాతం వస్తువులపై ఈయూ సుంకాలను తగ్గించనుంది. ఇది ఇరుపక్షాల మధ్య వాణిజ్య అవకాశాలను గణనీయంగా పెంచుతుందని భావిస్తున్నారు. కాగా, మార్కెట్లలో ఇవాళ రోజంతా అస్థిరత కనిపించింది. మహీంద్రా అండ్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐటీసీ, మారుతీ సుజుకీ వంటి హెవీవెయిట్ షేర్లు 4 శాతం వరకు నష్టపోయి మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి. మరోవైపు, యాక్సిస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఎన్టీపీసీ, టెక్ మహీంద్రా, టాటా స్టీల్, ఎస్‌బీఐ వంటి షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. ఈ షేర్లు 5 శాతం వరకు లాభపడి సూచీలకు మద్దతుగా నిలిచాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 3 శాతం దూసుకెళ్లింది. అయితే, నిఫ్టీ మీడియా 1.4 శాతం, నిఫ్టీ ఆటో 0.9 శాతం చొప్పున నష్టపోయాయి. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ 100 సూచీలు కూడా లాభాల్లోనే ముగిశాయి. నిఫ్టీకి 25,000 వద్ద కీలక మద్దతు ఉందని, దాని దిగువకు పడితే అమ్మకాల ఒత్తిడి పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఇన్వెస్టర్లు అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల నిర్ణయం, రాబోయే కేంద్ర బడ్జెట్ కోసం ఎదురుచూస్తున్నారని విశ్లేషకులు తెలిపారు.

## వయ్యారి చిత్రం



ఇషా గుప్తా

# సందీప్ వంగా డబుల్ సర్ప్రైజ్



టాలెంటెడ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ఇప్పుడు స్పిరిట్ మూవీతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ లీడ్ రోల్ లో రూపొందుతున్న ఆ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే భారీ అంచనాలు క్రియేట్ చేసుకున్న స్పిరిట్.. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. అందుకు తగ్గ ప్లాన్ తో వంగా.. మూవీని ముందుకు తీసుకెళ్తున్నారని సమాచారం. అయితే స్పిరిట్ మూవీ కంప్లీట్ అవ్వగానే.. ఆయన యానిమల్ పార్క్ ను మొదలుపెట్టనున్నారు. రెండేళ్ల క్రితం రిలీజ్ అయిన యానిమల్ మూవీకి సీక్వెల్ గా ఆ సినిమా తీయనున్నారు. నిజానికి.. బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్ హీరోగా నటించిన యానిమల్.. ఎలాంటి హిట్ అయిందో తెలిసిన విషయమే. బాక్సాఫీస్ వద్ద వరల్డ్ వైడ్ గా భారీ వసూళ్లను సాధించి దూసుకుపోయింది. ఓవైపు సినిమాపై విమర్శలు వచ్చినా.. మరోవైపు రూ.900 కోట్ల కలెక్షన్స్ సాధించింది. ఫాథర్ అండ్ సన్ ఎమోషనల్ కాన్సెప్ట్ తో వచ్చిన ఆ సినిమా ఎన్నో రికార్డులు కూడా క్రియేట్ చేసింది. మోస్ట్ వైలెంట్ కంటెంట్ తో వచ్చిన ఆ సినిమాకు సీక్వెల్ కూడా ఉంటుందని ఇప్పటికే ప్రకటించారు మేకర్స్. యానిమల్ పార్క్ అనే టైటిల్ కూడా ఫిక్స్ చేశారు. అయితే ఇప్పుడు ఆ సినిమాకు సంబంధించిన ఇంట్రెస్టింగ్ అప్డేట్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రణబీర్ కపూర్.. యానిమల్ పార్క్ మూవీ కోసం మాట్లాడారు. ఆ సినిమాలో తాను డ్యూయెల్ రోల్ పోషిస్తున్నట్లు తెలిపారు. ఒక పాత్రలో హీరోగా.. మరో పాత్రలో విలన్ గా నటిస్తున్నట్లు చెప్పారు. దీంతో వంగా డబుల్ సర్ప్రైజ్ ఇవ్వనున్నారన్నమాట! అదే సమయంలో సందీప్ రెడ్డి వంగా తన ప్లాన్ కు అనుగుణంగా సినిమాను రూపొందించడానికి సమయం తీసుకుంటారని రణబీర్ కపూర్ పేర్కొన్నారు. తనకు డైరెక్టర్ పై పూర్తి నమ్మకం ఉందని తెలిపారు. మొత్తంగా యానిమల్ ఫ్రాంఛైజీ మూడు భాగాలు అని తెలిపారు. రెండో పార్ట్ చిత్రీకరణ వచ్చే ఏడాది మొదలు కానుందని చెప్పారు. అందుకు తగ్గ ప్లాన్ తో సందీప్ ఉన్నారని వెల్లడించారు. అయితే రణబీర్ కామెంట్స్ ప్రకారం.. యానిమల్ పార్క్ చిత్రీకరణ 2027లో ప్రారంభమైతే.. విడుదల మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. సినిమాను థియేటర్లలో చూడటానికి అభిమానులు 2028 వరకు వేచి ఉండాల్సి రావచ్చు. ప్రీ- ప్రొడక్షన్, షూటింగ్, పోస్ట్- ప్రొడక్షన్, ప్రమోషన్స్ అన్నింటికీ కలిపి కచ్చితంగా సంవత్సరం టైమ్ అవుతుంది. కాబట్టి 2028లో యానిమల్ పార్క్ మూవీ.. ప్రేక్షకుల ముందుకు రానుందనే చెప్పాలి. మరి చూడాలి ఏం జరుగుతుందో..



## పవన్‌తో జర్నీ స్పెషల్ : భూమిక

సీనియర్ దర్శకుడు గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందిన యుఫోరియా విడుదలకు సిద్ధం అయింది. ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న యుఫోరియా సినిమా సాంగ్ లాంచ్ కార్యక్రమం వైజాగ్‌లో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారీ ఎత్తున జనాలు హాజరు అయిన ఈ కార్యక్రమంలో పాటను విడుదల చేయడం చాలా సంతోషంగా ఉందంటూ గుణశేఖర్ చెప్పుకొచ్చాడు. ఒక స్టార్ హీరో సినిమా ఈవెంట్ రేంజ్ లో అభిమానులు, జనాలు హాజరు కావడంతో సినిమా సాంగ్ లాంగ్ ఈవెంట్ భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. సినిమా ఇప్పటికే జనాల్లోకి చేరిందని, ఈ కార్యక్రమంతో మరింతగా సినిమా గురించి జనాలు చర్చించుకోవడం ద్వారా కచ్చితంగా మంచి ఓపెనింగ్ సినిమాకు దక్కుతుంది అనే అభిప్రాయంను విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. యుఫోరియాలో భూమిక కీలక పాత్రలో నటించింది.

## గాంధీ టాక్స్.. మాటల్లేవ్!



సినిమాను ఎంత కొత్తగా తీస్తే ఇప్పటి ప్రేక్షకులు అంత ఎక్కువ ఆదరిస్తున్నారు. అందుకే సినీ మేకర్స్, క్రియేటర్స్ కూడా ఒక సినిమాను ఎంత కొత్తగా తీయాలి అన్న దాని మీద ఫోకస్ చేస్తున్నారు. కోట్ల కొద్దీ బడ్జెట్ పెట్టి సినిమా తీసినా అందులో ఎలాంటి కొత్తదనం లేకపోతే ఆడియన్స్ దాన్ని తిప్పికొడతారు. లిమిటెడ్ బడ్జెట్ తో తీసినా కొత్త పాయింట్ తో ప్రేక్షకులను మెప్పించగలిగితే చాలు దాన్ని వాళ్లు భుజాన వేసుకుని సక్సెస్ చేస్తారు. ఐతే ఈ లాజిక్ మాక్సిమం చాలా సినిమాలకు వర్క్ అవుట్ అయ్యింది.. అవుతుంది. ఏవో ఒకటి అర మిస్ ఫైర్ అవుతాయి. ఐతే ప్రేక్షకులకు ఒక కొత్త సినిమాటిక్ ఎక్స్ పెరిమెంట్ అందించాలని డైరెక్టర్ కిషోర్ పండురంగ్ బెలెకర్ చేస్తున్న ప్రయత్నమే గాంధీ టాక్స్. విజయ్ సేతుపతి, అదితి రావు హైదరి, అరవింద సామితో పాటు మరికొంతమంది ముఖ్య తారాగణంతో వస్తున్న ఈ సినిమా ట్రైలర్ లేటెస్ట్ గా రిలీజైంది.

## నిఖిల్ స్వయంభు.. రికార్డుల మోతే!



కార్తికేయ 2 తో పాన్ ఇండియా హిట్ అందుకున్న నిఖిల్ సిద్ధార్థ్ ఆ సినిమా తర్వాత తను చేస్తున్న రెండు భారీ సినిమాల అనౌన్స్ మెంట్ తో హైప్ తెప్పించాడు. అందులో ఒకటి చరణ్ నిర్మాణంలో ది ఇండియా హౌజ్ కాగా మరోటి స్వయంభు. పిరియాడికల్ బ్యాక్ డ్రాప్ తో తెరకెక్కుతున్న ఫిక్షనల్ స్టోరీ స్వయంభు. ఈ సినిమాను భరత్ కృష్ణమాచార్య డైరెక్ట్ చేస్తున్నారు. సినిమా అనౌన్స్ చేసి చాలా రోజులు అవుతున్నా ఇప్పటివరకు ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు. ఐతే రీసెంట్ గా నిఖిల్ అండ్ టీం సినిమా మేకింగ్ వీడియోతో సర్ ప్రైజ్ చేశారు. ఆ వీడియో తర్వాత స్వయంభు సినిమాపై ఇంకాస్త ఇంట్రెస్ట్ పెరిగింది. స్వయంభు సినిమాలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్ హీరోయిన్ గా నటిస్తుంది. నభా నటేష్ కూడా మరో హీరోయిన్ గా చేస్తుంది. నిఖిల్ స్వయంభు సినిమా రిలీజ్ విషయంలో కాస్త కన్ ఫ్యూజన్ ఏర్పడింది. ముందు ఈ సినిమాను ఫిబ్రవరి 13న రిలీజ్ ఫిక్స్ చేశారు. ఐతే ఇప్పుడు ఆ డేట్ ని మార్చినట్టు తెలుస్తుంది. స్వయంభు సినిమా ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ కి షిఫ్ట్ అయినట్టు తెలుస్తుంది. ఫిబ్రవరి 13న పోటీలో చాలా సినిమాలు ఉండటం వల్ల సినిమాకు సోలో రిలీజ్ ఉంటే బాగుంటుంది అనే ఉద్దేశ్యంతో ఫిబ్రవరి 13న రావాల్సిన స్వయంభు సినిమాను ఏప్రిల్ 10కి వాయిదా వేశారు. సమ్మర్ లో స్టార్ సినిమాల మధ్య నిఖిల్ స్వయంభు సందడి చేయబోతుంది. ఆల్రెడీ మార్చి మంత్ మిడిల్ నుంచి సినిమాల హంగామా ఉండబోతుంది ఏప్రిల్ 10న నిఖిల్ స్వయంభుతో దాన్ని మరింత కొనసాగించాలని ఫిక్స్ అయ్యారు.

## సినీ ఇండస్ట్రీలో సెక్స్ కమిట్‌మెంట్: చిన్మయి

క్యాస్టింగ్ కౌచ్.. సినీ వర్గాల్లో ఎప్పటికప్పుడు వినిపించే మాట! రీసెంట్ గా టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి తొలిసారి బహిరంగంగా స్పందించారు. తన లేటెస్ట్ మూవీ మన శంకర వరప్రసాద్ గారు సక్సెస్ మీట్ లో ఆ విషయాన్ని ప్రస్తావించారు. సినీ ఇండస్ట్రీ మిర్రర్ లాంటిదని, మనం ఏది ఇస్తే అదే తిరిగి వస్తుందని వ్యాఖ్యానించారు. పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ లేదని, ఒక వేళ ఇలాంటి చేదు అనుభవాలు ఎదురైనా అది మీ తప్పు అన్నట్లు అన్నారు. దీంతో ఆయన వ్యాఖ్యలు ఫుల్ వైరల్ గా మారగా.. నెటిజన్లు ఒక్కొక్కరు ఒక్కోలా రెస్పాండ్ అయ్యారు. ఇప్పుడు ఎప్పుడూ మొహమాటం లేకుండా కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడే సింగర్ చిన్మయి శ్రీపాద క్యాస్టింగ్ కౌచ్ పై సోషల్ మీడియాలో లాంగ్ పోస్ట్ పెట్టి సంచలన వ్యాఖ్యలు చేశారు. క్యాస్టింగ్ కౌచ్ ఇప్పటికీ కొనసాగుతోందని, ఫుల్ కమిట్‌మెంట్ అనే పదం పేరుతో మహిళలపై అనుచిత ఒత్తిళ్లు తెస్తున్నారని ఆమె ఆరోపించారు. సాధారణంగా కమిట్మెంట్ అంటే ప్రొఫెషనలిజం, పనిపై నిబద్ధత అని భావించే వారికి సినిమా ఇండస్ట్రీలో ఆ పదానికి పూర్తిగా భిన్నమైన అర్థం ఉంటుందని పేర్కొన్నారు. పెద్ద హోదాల్లో ఉన్న కొంతమంది పురుషులు మహిళల నుంచి శారీరక అనుకూలతలు ఆశిస్తారని ఆరోపించారు. తనకు తెలిసిన ఓ ఘటనను ఉదాహరణ చెబుతూ, ఓ మ్యూజిక్ డైరెక్టర్ స్టూడియోలో ఓ యువ సింగర్ పై లైంగిక దాడికి ప్రయత్నించగా, ఆమె భయంతో సౌండ్ బూత్ లోకి వెళ్లి తలుపు వేసుకొని కూర్చొందని తెలిపారు.

## ఈషా.. ఫ్రెండ్‌కు మించి





2016లో విజయ్ దేవరకొండను హీరోగా పరిచయం చేస్తూ తెరకెక్కించిన చిత్రం పెళ్లి చూపులు. ఈ సినిమా ద్వారా దర్శకుడుగా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు తరుణ్ భాస్కర్ దాస్యం. ఈ సినిమాకి ఉత్తమ ప్రాంతీయ చిత్రంగానే కాకుండా ఉత్తమ మాటల రచయితగా కూడా ఈయనకు నేషనల్ అవార్డు లభించింది. ఈ సినిమా తర్వాత దర్శకుడిగానే కాకుండా నటుడిగా కూడా మంచి పేరు దక్కించుకున్నారు. 2019లో మీకు మాత్రమే చెప్తా అనే సినిమా ద్వారా హీరోగా ఇండస్ట్రీకి పరిచయమైన తరుణ్ భాస్కర్ మిడిల్ క్లాస్ మెలోడీస్ అనే చిత్రంలో అతిథి పాత్ర కూడా పోషించారు.చివరిగా 2023లో కీడా కోలా అనే చిత్రానికి దర్శకత్వం వహించడమే కాకుండా అందులో నటించాడు కూడా. అలాంటి ఈయన 2024లో మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా అనే చిత్రంలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అలాంటి ఈయన తాజాగా హీరోగా నటిస్తున్న చిత్రం ఓం శాంతి శాంతి శాంతిః.. మలయాళంలో వచ్చిన సూపర్ హిట్ మూవీ జయ జయ జయ జయహే చిత్రానికి రీమేక్ కావడం గమనార్హం. ఈషా రెబ్బ హీరోయిన్గా నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ సజీవ్ దర్శకుడిగా పనిచేస్తున్నారు. కామెడీ ఎంటర్టైనర్ గా వస్తున్న ఈ సినిమా జనవరి 30వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలలో పాల్గొంటున్న చిత్ర బృందం సినిమా గురించి పలు విషయాలు పంచుకున్న విషయం తెలిసిందే.మరోవైపు పలు ఇంటర్వ్యూలు ఇస్తూ తెగ సందడి చేస్తున్న తరుణ్ భాస్కర్ గత కొంతకాలంగా ఈషా రెబ్బాతో డేటింగ్ లో ఉన్నట్లు వార్తలు రాగా దానిపై స్పందించి అందరిని ఆశ్చర్యపరిచారు. ఇంటర్వ్యూలో భాగంగా మీరు ఈ సినిమా మొదలుపెట్టినప్పటి నుంచి ఈషా రెబ్బాతో డేటింగ్ లో ఉన్నట్లు పలు రకాల కథనాలు



# టీమిండియా-19
# హ్యాట్రిక్ విక్టరీ

**సగం పరుగులూ చేయని జింబాబ్వే**

అండర్ 19 వన్డే ప్రపంచకప్ 2026లో టీమిండియా జైత్రయాత్ర కొనసాగుతోంది. వరుసగా మూడో మ్యాచ్‌లో గెలిచి హ్యాట్రిక్ విక్టరీ నమోదు చేసింది. సూపర్ సిక్సెస్ గ్రూప్-2లో భాగంగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత అండర్ 19 జట్టు 204 పరుగుల భారీ తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. బ్యాటింగ్‌లో విహాన్ మల్హోత్ర సెంచరీతో చెలరేగగా.. వైభవ్ సూర్యవంశీ, అభిజ్ఞాన్ కుండు హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. బౌలింగ్‌లో కెప్టెన్ ఆయుష్ మాత్రే(3/14)తో పాటు ఉధవ్ మోహన్(3/20) తీన్మార్ బౌలింగ్‌తో జింబాబ్వే పతనాన్ని శాసించారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన యువ భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 352 పరుగులు చేసింది. విహాన్ మల్హోత్రా(107 బంతుల్లో 7 ఫోర్లతో 109 నాటౌట్) అజేయ సెంచరీతో కదం తొక్కగా.. వైభవ్ సూర్యవంశీ(30 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 52), అభిజ్ఞాన్ కుండు(62 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 61) హాఫ్ సెంచరీలతో రాణించారు. కెప్టెన్ ఆయుష్ మాత్రే(16 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 23) మరోసారి నిరాశపర్చాడు. జింబాబ్వే బౌలర్లలో తటెండా చిముగోరో మూడు వికెట్లు తీయగా.. సింబరాషే ముడ్జెంగెరెరే, పనాషే మజాయ్ రెండేసి వికెట్లు పడగొట్టారు. ధ్రువ్ పటేల్ ఒక వికెట్ దక్కింది. అనంతరం జింబాబ్వే 37.4 ఓవర్లలో 148 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. జింబాబ్వే బ్యాటర్లలో లిరోయ్ చివావులా(77 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 62) హాఫ్ సెంచరీతో రాణించినా ఫలితం లేకపోయింది. భారత్ చేసిన 352 పరుగుల్లో జింబాబ్వే సగం కూడా చేయలేకపోయింది. భారత బౌలర్లలో ఉధవ్ మోహన్, ఆయుష్ మాత్రే మూడు వికెట్లు తీయగా.. హెనిల్ పటేల్, ఖిలాన్ పటేల్ చెరో వికెట్ తీసారు. సూపర్ సిక్స్ గ్రూప్-2లో భారత్ మూడు మ్యాచ్‌లకు మూడు గెలిచి టేబుల్ టాపర్‌గా కొనసాగుతోంది. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను ఆదివారం పాకిస్థాన్‌తో ఆడనుంది. ఈ టోర్నీలో పాకిస్థాన్ మూడు మ్యాచ్‌లకు రెండు గెలిచి మూడో స్థానంలో కొనసాగుతోంది. ఆదివారం జరిగే హై ఓల్టేజ్ మ్యాచ్ కోసం యావత్ క్రికెట్ ప్రపంచం ఆసక్తిగా ఎదురు చూస్తోంది.



# ఆర్సీబీ వాటా కొనే ఆలోచనలో కోహ్లీ?

టీమిండియా స్టార్ క్రికెటర్, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ తన సతీమణి అనుష్క శర్మతో కలిసి భారీ స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. అమ్మకానికి వచ్చిన తన ఐపీఎల్ ఫ్రాంచైజీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)లో మైనారిటీ వాటాను అనుష్క శర్మ పేరిట కొనుగోలు చేయాలని భావిస్తున్నాడని సమాచారం. ఈ డీల్ విలువ సుమారు రూ. 400 కోట్లు ఉంటుందని బిజినెస్ ఎక్స్‌పర్ట్స్ అంచనా. ఈ వ్యవహారంపై ఎలాంటి అధికారిక ప్రకటన రాకున్నా.. జోరుగా ప్రచారం సాగుతోంది. తన కెరీర్ మొత్తం ఆర్‌సీబీకే ఆడిన కోహ్లీ.. ఫ్రాంచైజీ పార్ట్‌నర్‌గా మారాలనుకుంటున్నాడని తెలుస్తోంది. ఆర్‌సీబీ ఫ్రాంచైజీకి ప్రస్తుతం డియాజియో ఇండియా అనే సంస్థ యజమానిగా ఉంది. ఐపీఎల్ 2025 సీజన్ ముగిసిన వెంటనే ఆర్‌సీబీ ఫ్రాంచైజీని డియాజియో అమ్మకానికి పెట్టినట్లు వార్తలు



వచ్చాయి. ఫ్రాంచైజీ విలువ సుమారుగా 2 బిలియన్ల అమెరికా డాలర్లుగా(రూ.17000 కోట్లు) ఉంటుందని అంచనా. డియాజియో కంపెనీ ప్రధాన వ్యాపారం మద్యం. డియాజియోకు అమెరికా అతిపెద్ద మార్కెట్. అయితే అక్కడ సుంకాలు పెరగడం, వినియోగదారుల తగ్గడంతో ప్రీమియం మద్యం అమ్మకాలపై ప్రభావం పడింది. దాంతో ఆ సంస్థ..ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటుంది. ఈ క్రమంలోనే ఆర్‌సీబీ ఫ్రాంచైజీని అమ్మడం ద్వారా వచ్చే డబ్బులను ప్రధాన వ్యాపారంపై పెట్టాలనే యోచనలో డియాజియో ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆర్‌సీబీ విజేతగా నిలవడంతో ఫ్రాంచైజీ విలువ రెట్టింపు అయ్యింది. ఈ క్రేజ్‌ను క్యాష్ చేసుకోవాలనే ఆలోచనలో డియాజియో సంస్థ ఉన్నట్లు వార్తలు వచ్చాయి. కానీ ఇప్పటి వరకు ఈ వ్యవహారంపై డియాజియో సంస్థ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఆర్‌సీబీని కొనుగోలు చేసేందుకు అదానీ గ్రూప్‌తో పాటు ఢిల్లీ క్యాపిటల్స్ కో ఓనర్‌గా ఉన్న జేఎస్‌డబ్ల్యూ-పార్థ్ జిందాల్, అథర్ పూనవల్లా, కన్నడ సినీ పరిశ్రమకు చెందిన హోంబాలే ఫిల్మ్స్ సంస్థతో పాటు మరో రెండు అమెరికన్ కంపెనీలు ఆసక్తిగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా అనుష్క శర్మతో పాటు బాలీవుడ్ హీరో రణబీర్ కపూర్ 2 శాతం వాటా కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ పేర్కొంది.



# ఢిల్లీకి గుజరాత్ షాక్

**ఆఖరి ఓవర్‌లో విక్టరీ.. నిక్కీప్రసాద్, స్నేహ్ రానా పోరాటం వృథా**

మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఉత్కంఠ పోరు అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. ఆఖరి ఓవర్ థ్రిల్లర్‌లో గుజరాత్ జెయింట్స్ అద్భుతరీతిలో ఓటమి తప్పించుకుంది. భారీ ఛేదనలో ప్రధాన బ్యాటర్లు విఫలమవ్వడంతో ఢిల్లీ క్యాపిటల్స్ కథ ముగిసింది అనుకున్నారంతా. కానీ, నిక్కి ప్రసాద్(47), స్నేహ్ రానా (29) ఫోర్లు, సిక్సర్లతో చెలరేగి గుజరాత్ నుంచి విజయాన్ని లాగేసుకున్నంత పని చేశారు. అయితే.. ఆఖరి ఓవర్లో రానాను ఔట్ చేసిన సోఫీ డెవెనె చివరి బంతికి నిక్కీని వెనక్కి పంపడంతో.. 3 పరుగుల తేడాతో గుజరాత్ విక్టరీ కొట్టింది. డబ్ల్యూపీఎల్‌లో మరో థ్రిల్లింగ్ మ్యాచ్. ఈసారి గుజరాత్ జెయింట్స్ స్టార్ సోఫీ డెవిన్ మ్యాచ్‌ను కాపాడింది. ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్ల విధ్వంసంతో ఆశలు ఆవిరైన వేళ.. ఆఖరి ఓవర్లో రెండు వికెట్లు తీసి జట్టును గెలిపించింది. 20 వ ఓవర్లో స్నేహ్ రానా(29) ఔట్ కావడం.. చివరి బంతికి 4 రన్స్ అవసరమవ్వగా నిక్కి ప్రసాద్(47) క్యాచ్ ఔట్ కావడంతో 3 పరుగుల తేడాతో గుజరాత్ విజయం సాధించింది. ప్లే ఆఫ్స్ సమీకరణాలు మారుతు మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ జెయింట్స్ .. బేత్ మూనీ(58), అనుష్క శర్మ(39), తనూజా కన్వర్(21 నాటౌట్) మెరుపులతో భారీ స్కోర్ చేసింది. ఢిల్లీ బౌలర్లలో శ్రీ చరణి(4-31) రాణించింది.

# ఆ మూడూ.. ముప్పే!

**ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, సౌతాఫ్రికా నుంచి గట్టి పోటీ**

## టీ20 వరల్డ్ కప్‌లో భారత్‌కు కలవరం

అప్‌కమింగ్ ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీకి టీమిండియా అన్ని విధాల సిద్ధమైంది. ఈ మెగా టోర్నీకి చివరి సన్నదతగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌ను టీమిండియా మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే కైవసం చేసుకుంది. ఇప్పటి వరకు జరిగిన మూడు టీ20ల్లో పూర్తి ఆధిపత్యం చెలాయించి ఏకపక్ష విజయాలను సాధించింది. ముఖ్యంగా గౌహతి వేదికగా జరిగిన మూడో టీ20లో 154 పరుగుల లక్ష్యాన్ని 10 ఓవర్లలోనే ఛేదించి ప్రత్యర్థుల వెన్నులో వణుకు పుట్టించింది. భీకర బ్యాటింగ్ లైనప్‌కు ఫిదా అయిన దిగ్గజ క్రికెటర్లు గవాస్కర్, సైమన్ డౌల్.. టీమిండియాకు టీమిండియానే పోటీ అని కొనియాడారు. విధ్వంసకర బ్యాటింగ్.. మెరుపులాంటి ఫీల్డింగ్, కత్తిలాంటి బౌలింగ్‌తో సమతూకంగా కనిపిస్తున్న టీమిండియాకు మెగా టోర్నీలో మూడు జట్లతో ముప్పు పొంచి ఉంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే ఏ హోమ్ జట్టు టైటిల్ గెలవలేదు. ఈ రికార్డ్ కూడా భారత్‌ను కలవరపెడుతోంది. మెగా టోర్నీ లీగ్ దశలో టీమిండియాకు తిరుగులేకున్నా.. సూపర్-8లో గట్టి పోటీ ఎదురు కానుంది. నమీబియా, నెదర్లాండ్స్, అమెరికా, పాకిస్థాన్‌లతో గ్రూప్-ఏలో ఉన్న ఆతిథ్య భారత్ ఈజీగా సూపర్-8కు అర్హత సాధిస్తోంది. పాకిస్థాన్‌తో కాస్త పోటీ ఎదురైనా.. గతంతో పాటు ఇటీవల రికార్డ్‌లను



పరిగణలోకి తీసుకుంటే టీమిండియాదే పైచేయిగా కనిపిస్తోంది. సూపర్-8లో టీమిండియాకు ఆస్ట్రేలియా గట్టి పోటీనిచ్చే అవకాశం ఉంది. ఐసీసీ టోర్నీల్లో ఆస్ట్రేలియాను ఎప్పుడూ తక్కువ అంచనా వేయలేం. ముఖ్యంగా ఆసియా పిచ్‌లపై ఆసీస్ దుమ్మురేపుతోంది. ఆడమ్ జంపా వంటి నాణ్యమైన స్పిన్నర్‌తో పాటు ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్ వంటి డేంజరస్ హిట్టర్లు ఆ జట్టులో ఉన్నారు. తీవ్ర ఒత్తిడిలోనూ రాణించడం వారికి వెన్నతో పెట్టిన విద్య. భారత్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్ 2023లో టీమిండియాను ఓడించే ఆసీస్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. మరోసారి అదే ఫలితాన్ని రిపీట్ చేసి విశ్వవిజేతగా నిలవాలనే పట్టుదలతో ఆసీస్ ఉంది. ఐపీఎల్ కారణంగా ఇక్కడి పిచ్‌లపై ఆసీస్ ఆటగాళ్లకు మంచి పట్టు ఉంది. ఈ క్రమంలోనే టీమిండియాకు ఆసీస్ గట్టి పోటీదారి కానుంది. పొట్టి ఫార్మాట్‌లో భారత్ తరహాలోనే అత్యంత దూకుడుగా ఆడే జట్టు ఇంగ్లండ్. హ్యారీ బ్రూక్ సారథ్యంలో ఆ జట్టు భీకరంగా కనిపిస్తోంది. జోస్ బట్లర్, లియామ్ లివింగ్ స్టోన్ వంటి హిట్టర్లతో ఇంగ్లండ్ బలంగా ఉంది. ఎంత పెద్ద లక్ష్యాన్ని అయినా ఛేదించడంలో వారు దిట్ట. ఐపీఎల్ కారణంగా ఇంగ్లండ్ ఆటగాళ్లకు భారత పిచ్‌లు సుపరిచితమే. మేటి స్పిన్నర్లు కూడా ఆ జట్టులో ఉన్నారు.

### బంగ్లాదేశ్ జర్నలిస్ట్‌లకు
# అక్రిడిటేషన్స్ తిరస్కరణ

పంతానికి పోయి టీ20 వరల్డ్‌కప్ అవకాశాన్ని చేజార్చుకున్న బంగ్లాదేశ్‌కు ఐసీసీ మరో షాకిచ్చింది. ప్రపంచకప్ మ్యాచ్‌ల కవరేజీ కోసం దరఖాస్తు చేసుకున్న ఆ దేశానికి చెందిన క్రీడా జర్నలిస్టులకు అనుమతి నిరాకరించింది. దాదాపు వందకుపైగా అప్లికేషన్లను అంతర్జాతీయ క్రికెట్ మండలి తిరస్కరించింది. దాంతో.. తమ బోర్డు చేసిన తప్పిదానికి మమల్ని శిక్షించవద్దని వారు వేడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మీడియా అక్రిడిటేషన్స్ జారీని మరోసారి పరిశీలిస్తామని ఐసీసీ వెల్లడించింది. 'మా దేశ క్రీడా జర్నలిస్ట్‌ల దరఖాస్తులను తిరస్కరించారనే విషయం సోమవారం తెలిసింది. అందుకు కారణం తెలపాలని ఐసీసీని కోరాం. ఇది అంతర్గత వ్యవహారం. అయితే.. ఐసీసీ ఎందుకు మావాళ్లకు అనుమతి ఇవ్వలేదో తెలుసుకోవాలనుకుంటున్నాం' అని ఆయన పేర్కొన్నాడు. ఇక వరల్డ్‌కప్ కవరేజీ కూడా అసాధ్యమేనా అనుకుంటున్న బంగ్లాదేశ్ జర్నలిస్ట్‌లకు ఊరటనిస్తూ అక్రిడిటేషన్ జారీ ప్రక్రియపై మరోసారి దృష్టి సారిస్తున్నామని ఐసీసీ తెలిపింది. 'దేశం ప్రాతిపదికన చూసినా ఒక్కో దేశానికి చెందిన జర్నలిస్ట్‌లకు అక్రిడిటేషన్స్ 40కి మించవు. వరల్డ్‌కప్ ఆతిథ్య బోర్డుల సూచనల ప్రకారం అక్రిడిటేషన్ దరఖాస్తులకు అనుమతినిస్తుంది. ఈసారి మెగా టోర్నీని కవర్ చేసేందుకు భారీగా జర్నలిస్ట్‌లు దరఖాస్తు చేసుకున్నారు. దాంతో.. అక్రిడిటేషన్ పాసుల జారీ ప్రక్రియను మరోసారి పరిశీలిస్తున్నాం.



# తిలక్ వర్మ మ్యాచ్ విన్నర్

టీమిండియా యువ బ్యాటర్, తెలుగు తేజం తిలక్ వర్మపై మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ప్రశంసల జల్లు కురిపించాడు. తిలక్ వర్మ మాటలు అమయాకంగా ఉన్నా.. అతను మ్యాచ్ విన్నర్ అని కొనియాడాడు. ఆసియా కప్ 2025 ఫైనల్లో అతను ఆడిన ఇన్నింగ్స్ అసాధారణమని ప్రశంసించాడు. టీమిండియా టీ20 టీమ్‌లో రెగ్యులర్ ప్లేయర్‌గా మారిన తిలక్ వర్మ.. వృషణాల సర్జరీతో న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌కు దూరమయ్యాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ జట్టులో భాగంగా ఉన్న అతను మెగా టోర్నీ సమయానికి జట్టులోకి రానున్నాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
బుధవారం 28-1-2026

# పౌర హక్కుల కాపలాదారు!



**భారతదేశం** వంటి వైవిధ్యభరితమైన దేశంలో రాజ్యాంగం అనేది ఒక పవిత్ర గ్రంథం అయితే, ఆ గ్రంథానికి సరైన భాష్యం చెబుతూ, దాని ఆశయాలను కాపాడే శక్తి సుప్రీం కోర్టు. 1950 జనవరి 28న ప్రారంభమైన ఈ అత్యున్నత న్యాయస్థానం, గత ఏడు దశాబ్దాలకు పైగా దేశ గమనాన్ని నిర్దేశించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ప్రభుత్వాలు చేసే చట్టాలు రాజ్యాంగ పరిధిని దాటినప్పుడు, వాటిని సమీక్షించి, అవసరమైతే రద్దు చేసే న్యాయ సమీక్ష అధికారం సుప్రీం కోర్టుకు ఉన్న అతిపెద్ద ఆయుధం. కేశవానంద భారతి వంటి చారిత్రాత్మక తీర్పుల ద్వారా రాజ్యాంగం యొక్క ప్రాథమిక స్వరూపాన్ని మార్చే అధికారం పార్లమెంటుకు కూడా లేదని స్పష్టం చేసి, మన ప్రజాస్వామ్య పునాదులను ఈ కోర్టు పదిలం చేసింది. న్యాయం అనేది కేవలం ధనవంతులకు, బలవంతులకు మాత్రమే పరిమితం కాకూడదని ప్రజా ప్రయోజన వ్యాజ్యాల ద్వారా సుప్రీం కోర్టు నిరూపించింది. ఒక పోస్ట్ కార్డ్ ద్వారా కూడా సామాన్యుడు కోర్టును ఆశ్రయించి న్యాయం పొందే వెసులుబాటు కల్పించడం ప్రపంచ న్యాయ చరిత్రలోనే అరుదైన విషయం. పర్యావరణ పరిరక్షణ, మానవ హక్కుల ఉల్లంఘన, మహిళా భద్రత వంటి అంశాల్లో సుప్రీం కోర్టు తీసుకున్న చొరవ అమోఘం. పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు సుప్రీం కోర్టు ఒక రక్షణ కవచంలా నిలుస్తుంది. జీవించే హక్కు అంటే కేవలం గాలి పీల్చుకోవడం కాదు, గౌరవప్రదంగా జీవించడం అని నిర్వచించి, వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా గుర్తించడం ద్వారా ఆధునిక కాలానికి అనుగుణంగా చట్టాలను మలిచింది. కోర్టుల ముందు పేరుకుపోయిన లక్షలాది కేసులు, న్యాయ ప్రక్రియలో ఆలస్యం వంటి సవాళ్లు ఉన్నప్పటికీ, నేటికీ సామాన్య భారతీయుడు తనకు అన్యాయం జరిగినప్పుడు నేను సుప్రీం కోర్టుకు వెళ్తాను అని నమ్మకంగా చెప్పగలుగుతున్నాడంటే అది ఆ వ్యవస్థ సంపాదించుకున్న అచంచలమైన విశ్వసనీయతకు నిదర్శనం. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు ఒక్కోసారి విఫలమైనా, న్యాయవ్యవస్థ తన స్వతంత్రతను చాటుకుంటూ దేశాన్ని సరైన మార్గంలో నడిపిస్తోంది. భారత సుప్రీం కోర్టు కేవలం తీర్పులు ఇచ్చే భవనం కాదు; అది వంద కోట్ల మంది భారతీయుల ఆశల దీపం. రాజ్యాంగబద్ధమైన పాలన కొనసాగేలా చూడటంలో దాని పాత్ర అజరామరం.

*– ఈవార్తలు సంపాదకీయ విభాగం*




# బంగ్లా క్రికెట్ బోర్డుకు మాయని మచ్చ

2026 టీ20 ప్రపంచకప్‌లో పాల్గొనబోమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తీసుకున్న షాకింగ్ నిర్ణయం ఆ దేశ క్రికెట్ చరిత్రలోనే అత్యంత వివాదాస్పదమైనదిగా నిలిచిపోయింది. భద్రతా కారణాలను సాకుగా చూపుతూ భారత్‌లో పర్యటించేందుకు నిరాకరించిన బీసీబీ తీరుపై క్రీడా విశ్లేషకులు మరియు అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచకప్ వంటి మెగా టోర్నీలో ఆడాలనేది ప్రతి ఆటగాడి కల.

**కానీ** క్రీడాకారులతో కనీసం చర్చించకుండా, కేవలం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి టోర్నీ నుంచి తప్పుకోవడం పట్ల నిరసనలు వ్యక్తమవుతున్నాయి.బంగ్లాదేశ్ వైఖరితో విసిగిపోయిన ఐసీసీ , వారి స్థానంలో స్కాట్లాండ్‌ను టోర్నీలోకి చేర్చింది. 2007 నుంచి అన్ని టీ20 వరల్డ్ కప్‌లలో ఆడిన బంగ్లాదేశ్, తొలిసారిగా ఈ మెగా ఈవెంట్‌కు దూరం కావడం ఆ దేశ ప్రతిష్టను దెబ్బతీసింది. ఈ నిర్ణయం వల్ల బీసీబీ సుమారు రూ.240 కోట్ల వరకు ఆదాయాన్ని కోల్పోనుంది. ఐసీసీ నుంచి వచ్చే నిధులు నిలిచిపోవడంతో పాటు, స్పాన్సర్లు కూడా వెనక్కి తగ్గే అవకాశం ఉంది. బీసీబీ తీసుకున్న నిర్ణయాలకు నిరసనగా కొందరు బోర్డు డైరెక్టర్లు తమ పదవులకు రాజీనామా చేశారు. అటు క్రీడాకారులు కూడా బోర్డు అధికారుల అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దేశవాళీ టోర్నీలను బహిష్కరించడం బోర్డు అసమర్థతను ఎత్తిచూపుతోంది. భారత్‌తో సిరీస్‌లను బహిష్కరించడం వల్ల భవిష్యత్తులో బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు ఇతర దేశాలతో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడే అవకాశం తగ్గుతుంది. ఇది జట్టును అంతర్జాతీయంగా ఏకాకిని చేసే ప్రమాదం ఉందని మాజీలు హెచ్చరిస్తున్నారు. ఈ మొండి నిర్ణయం వల్ల బంగ్లాదేశ్ క్రికెట్ భవిష్యత్తు అంధకారంలో పడే ప్రమాదం ఉంది. క్రీడలను రాజకీయాలతో ముడిపెట్టి, పారదర్శకత లేని నిర్ణయాలు తీసుకోవడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణమని స్పష్టమవుతోంది.

– రవి కిషన్, క్రికెట్ విశ్లేషకుడు



# డిజి దొంగలున్నారు.. జాగ్రత్త!



డిజిటల్ భద్రత, వ్యక్తిగత గోప్యత: డిజిటల్ యుగంలో అత్యవసరమైన సవాళ్లు, పరిష్కారాలు ఆధునిక డిజిటల్ యుగంలో, మన జీవితాలు పూర్తిగా డిజిటల్ ప్రపంచంతో ముడిపడి ఉన్నాయి. స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ ఆధారిత సేవలు, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, క్లౌడ్ స్టోరేజ్ వంటివి మన రోజువారీ కార్యకలాపాల్లో అంతర్భాగమయ్యాయి. అయితే, ఈ సాంకేతిక పురోగతి మనకు సౌకర్యాలను అందిస్తున్నప్పటికీ, డిజిటల్ భద్రత, వ్యక్తిగత గోప్యతపై గంభీరమైన సవాళ్లను తెచ్చిపెట్టింది. డేటా బ్రీచెస్, సైబర్ అటాక్స్, డేటా మైనింగ్, ప్రభుత్వ ఆధిపత్యం వంటి సమస్యలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశాలుగా మారాయి.




ఈ సంపాదకీయంలో, డిజిటల్ భద్రత, వ్యక్తిగత గోప్యత వివిధ కోణాలను పరిశీలిస్తాం, తాజా ఉదాహరణలు, చట్టాలు, ఉత్తమ పద్ధతులు, భవిష్యత్ సవాళ్లను చర్చిస్తాం. ఈ విషయం మన డిజిటల్ జీవితాలను సురక్షితంగా చేయడానికి అత్యవసరమైనది,, ఇది కనీసం 4000 పదాలకు సమానమైన విస్తృత చర్చను అవసరపడుతుంది.డిజిటల్ భద్రత: నిర్వచనం, ప్రాముఖ్యతడిజిటల్ భద్రత అంటే డిజిటల్ సమాచారం, పరికరాలు, నెట్‌వర్క్‌లను అనధికారిక యాక్సెస్, దుర్వినియోగం లేదా నాశనం నుండి రక్షించడం. ఇది సైబర్ సెక్యూరిటీ ప్రధాన భాగం, ఇక్కడ హ్యాకర్లు, మాల్‌వేర్, ఫిషింగ్ అటాక్స్ వంటి బెదిరింపుల నుండి రక్షణ అవసరం. ప్రపంచవ్యాప్తంగా, డేటా బ్రీచెస్ సంఖ్య పెరుగుతోంది. ఉదాహరణకు, 2025లో అమెరికాలో డేటా బ్రీచెస్ సంఖ్య 20% పెరిగింది, ఇది మిలియన్ల మంది వ్యక్తుల వ్యక్తిగత సమాచారాన్ని ప్రమాదంలో పడేసింది. డిజిటల్ భద్రత లేకపోతే, ఆర్థిక నష్టాలు, గుర్తింపు దొంగతనం, రాజకీయ అస్థిరత వంటి సమస్యలు ఏర్పడతాయి. ఇండియాలో, సైబర్ క్రైమ్‌ల సంఖ్య 2025లో 1.5 మిలియన్‌కు చేరుకుంది, ఇది డిజిటల్ భద్రత అవసరాన్ని సూచిస్తుంది. హక్కు, సవాళ్లువ్యక్తిగత గోప్యత అంటే వ్యక్తుల డేటాను అనధికారికంగా సేకరించడం, ఉపయోగించడం లేదా షేర్ చేయడం నుండి రక్షించడం. ఇది ప్రాథమిక మానవ హక్కు, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో భాగం. డిజిటల్ యుగంలో, సోషల్ మీడియా, ఆన్‌లైన్ షాపింగ్, స్మార్ట్ డివైసెస్ మన డేటాను నిరంతరం సేకరిస్తున్నాయి. ఉదాహరణకు, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలు మన డేటాను ఉపయోగించి అడ్వర్టైజింగ్ చేస్తాయి. కంపెనీలు మన బ్రౌజింగ్ హిస్టరీని సేకరించి విక్రయిస్తాయి. ప్రభుత్వాలు డిజిటల్ ఐడీలతో మన కదలికలను ట్రాక్ చేస్తాయి. ఫేస్ రికగ్నిషన్ వంటివి గోప్యతను దెబ్బతీస్తాయి. ఇండియాలో, డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ 2025 చివరి నాటికి అమలులోకి వస్తుంది, ఇది గోప్యతను బలోపేతం చేస్తుంది. అమెరికాలో, డేటా బ్రీచ్ నోటిఫికేషన్ చట్టాలు అన్ని రాష్ట్రాల్లో ఉన్నాయి, ఇది బాధితులకు తెలియజేయడాన్ని తప్పనిసరి చేస్తుంది. ఇండియాలో, ఆధార్ డేటా లీక్‌లు, సైబర్ అటాక్స్ సాధారణమయ్యాయి. ఇలాంటి ఘటనలు ఆర్థిక నష్టాలు, గుర్తింపు దొంగతనానికి దారితీస్తాయి.



వినోద్ కుమార్

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.